J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 12

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




# లాయర్

సంపుటి : 41 సంచిక : 35 4.2.2022, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

# రామానుజుల ప్రాభవం ఆధ్యాత్మిక వైభవం



## అంగరంగ వైభవంగా సహస్రాబ్ది వేడుకలు

- ప్రపంచంలోనే 2వ అతిపెద్దదైన పద్మాసన స్థితి ప్రతిమ
- 1800 టన్నుల పంచలోహాలతో తయారీ
- 45 ఎకరాల్లో భగవద్రామానుజుల ప్రాంగణం
- 12 రోజుల పాటు సహస్రకుండ మహాయజ్ఞం
- 5న విగ్రహావిష్కరణ చేయనున్న ప్రధాని మోడీ

## 216 అడుగుల 'సమతామూర్తి' .. భావితరాలకు స్ఫూర్తి.. భారతావనికే కీర్తి!...

ఇది.. సకలమానవాళి శ్రేయస్సు కోసం జీవితాంతం పరితపించిన శ్రీశ్రీశ్రీ భగవద్రామానుజల వారి వెయ్యేళ్ళ పండుగ. సమాజంలో సమతావాదానికి, సమానత్వ నినాదానికి ఊపిరిపోసి సకల మానవాళి సంక్షేమం కోసం జీవితాన్నంతా వెచ్చించిన ఆ మహనీయుని పుట్టినరోజు పండుగ. యావత్ భారతావని సంతోష సంరంభంగా చేసుకునే ఆధ్యాత్మిక పండుగ.

12లో

# తెలుగోళ్ళపై.. సీతమ్మ శీతకన్ను



- బాబుపై మోడీ కోపం.. ఆంధ్రకు శాపం
- కేంద్ర బడ్జెట్లో ఆంధ్ర ఊసే లేదు
- అక్కడా అప్పుచేసి పప్పుకూడే
- ఈ ఏడాది 17 లక్షల కోట్ల లోటు

రాష్ట్ర పూర్వపు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుపై ప్రధాని నరేంద్రమోదీ కోపం ఇంకా తగ్గినట్టు లేదు. 2019 ఎన్నికలకు ఓ ఏడాది ముందునుంచీ తనను బాబు తూలనాడిన తీరు శాపమై... ఆంధ్ర రాష్ట్రం నష్టపోతున్న పరిస్థితి కొనసాగుతూనే ఉంది. చంద్రబాబు పదవి పోయి మూడేళ్లు కావస్తున్నప్పటికీ ఆంధ్రపై కేంద్రం కక్ష సాధింపు కొనసాగుతూనే ఉంది. ఫిబ్రవరి 1న కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్‌లో ఈ విషయం తేటతెల్లమైంది.

'అప్పుచేసి పప్పుకూడు తినరా ఓ నరుడా... గొప్ప నీతి వాక్యమిదే వినరా పామరుడా' అంటూ ఒక సినీకవి చెప్పినట్లుగా... కేంద్రం కుడా 23 లక్షల కోట్ల ఆదాయాన్ని ఒక వైపు చూపిస్తూ... 40 లక్షల కోట్ల ఖర్చుతో బడ్జెట్‌ని ప్రతిపాదించింది. అంటే మిగిలిన 17 లక్షల కోట్ల కోసం కేంద్రమూ అప్పుకోసం చేయి చాచాల్సిందే కదా...! కాబట్టి ఎంతటి వీరులైనా ప్రజల ఆకాంక్షలు, కోరికలు నెరవేర్చేలా ప్రభుత్వాన్ని నడపాలంటే అప్పు చేసి పప్పుకూడు పెట్టాల్సిందే.

10లో



# ఉప్పెనై ఉరిమిన ఉద్యోగులు

## 'చలో విజయవాడ' విజయవంతం

ప్రభుత్వ సలహాదారుల హెచ్చరికలు, పోలీసులచే ఉద్యోగుల గృహ నిర్బంధాలు, రాష్ట్రంలోని అన్ని బస్సుస్టేషన్లు, రైల్వేస్టేషన్లలో నిఘానేత్రాలూ, విజయవాడను కలిపే అన్ని రహదారుల దిగ్బంధనాలూ ఇవేమి ఉద్యోగుల 'చలో విజయవాడ'ను అడ్డుకోలేకపోయాయి. 5 వేల మందికే అనుమతి లేదంటూ పోలీసుశాఖ నిషేధాజ్ఞలు విధిస్తే, వేలాదిమంది ఉద్యోగులు పుట్టల్లో నుండి వచ్చిన చీమలలాగా బయటకు వచ్చి విజయవాడ నగరంలోని బిఆర్టీఎస్ రోడ్డుని నింపేశారు.

3లో



# అస్తమించిన 'తూర్పునేత'

# ముంగమూరు.. కన్నుమూత

నెల్లూరు నగరం తూర్పువైపున ఉన్నవారికి పెద్దదిక్కుగా, మంచి చెడులలో చేదోడు వాదోడుగా ఉంటుండిన ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి ఇక లేరు. నవాబుపేట, లక్ష్మీపురం, స్టోన్‌హౌస్‌పేట, తడికలబజార్, బాలాజీనగర్ ప్రాంత ప్రజలకు ఆయన కనిపించే దైవం. నెల్లూరు నగర నియోజకవర్గం రెండుగా విడిపోయి, గ్రామీణ నియోజకవర్గం ఏర్పడిన తరువాత జరిగిన తొలి ఎన్నికలలో నెల్లూరు నగర నియోజకవర్గం నుండి శాసనసభ్యునిగా గెలిచిన మొట్టమొదటి వ్యక్తి ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి. ఆయన ఆకస్మిక నిష్క్రమణ నగరంలోని తూర్పు ప్రాంత ప్రజలకు తీరని లోటు.

11లో

# ఆయుష్ మందులతో.. ఆరోగ్యం

**- జిల్లా కలెక్టర్**

ఆయుష్ మందులు ఆరోగ్యానికి దివ్యౌషధాల వంటివని జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు చెప్పారు. ఇటీవల ఆయన జిల్లా ఆయుష్‌శాఖ ఆధ్వర్యంలో నెల్లూరు కలెక్టరేట్‌లో మెగా వైద్యశిబిరాన్ని సందర్శించారు. ఆయుర్వేద మందులతో ఇతరత్రా ఎలాంటి ఇబ్బందులుండవని, తక్కువ ఖర్చుతోనే ఆయుర్వేద మందులు లభిస్తాయని కలెక్టర్ తెలిపారు. ప్రజలు ఆయుర్వేద మందులను వినియోగించుకొని ఆరోగ్యం పొందాలని చెప్పారు. బీపి, షుగర్, కీళ్ళనొప్పులు, నెమ్ము, నడుమునొప్పి తదితర సమస్యలకు చెందిన వారిని ఈ సందర్భంగా వైద్యులు పరీక్షించి మందులు అందజేశారు. ఆయుష్ డాక్టర్ గోవిందయ్య మాట్లాడుతూ భారతదేశం ఆయుర్వేదానికి పుట్టినిల్లని, ఆయుర్వేద మందులు ఎన్నోరకాల రోగాలను నయం చేస్తాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆయుర్వేద శాఖకు 5 కోట్ల రూపాయలు కేటాయించిందని, ఆ నిధులతో ఉచిత ఆయుర్వేద శిబిరాలు ఏర్పాటుచేస్తున్నామని, వ్యాధి నిరోధకశక్తిని పెంపొందింపజేసే అనేకరకాల మందులను ఉచితంగా అందజేస్తున్నామని వివరించారు.

**జంతు సంక్షేమం అందరి బాధ్యత :**

జంతు సంక్షేమం ఒక సామాజిక బాధ్యత అని, ప్రతిఒక్కరూ మూగజీవులను సంరక్షించుకోవాలని కలెక్టర్ చక్రధర్‌బాబు పిలుపునిచ్చారు. ఇటీవల నెల్లూరులోని కలెక్టరేట్‌లో జరిగిన జంతు సంక్షేమ కమిటీ సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు. జంతు పరిరక్షణ కోసం ప్రభుత్వాలు ఎన్నో చట్టాలు చేశాయని కలెక్టర్ వివరించారు. దొంతాలి గ్రామం వద్ద అయిదెకరాల భూమిని పశువుల సంరక్షణ కోసం కేటాయించినట్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్న నెల్లూరు నగర కమిషనర్ దినేష్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా జంతు సంరక్షణ చట్టాలపై ప్రజలందరికీ అవగాహన కలిగించేలా కరపత్రాలను, వాల్‌పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. జిల్లా జాయింట్ కలెక్టర్లు హరేంధిరప్రసాద్, విదేహ్‌ఖరే, రోజ్‌మాండ్‌లతో పాటు పశుసంవర్ధకశాఖ డెప్యూటీ డైరెక్టర్ సురేష్, జంతు సంక్షేమ కమిటీ సభ్యులు ఉమాదేవి, మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

# 7 నుంచి.. మునిసిపల్ కార్మికులు సమ్మెలోకి



మేయర్‌కు వినతిపత్రం అందిస్తున్న కార్మికసంఘం నాయకులు

ఎంతోకాలం నుంచి అపరిష్కృతంగా ఉన్న తమ కోర్కెల సాధన కోసం మునిసిపల్ కార్మికులు సమ్మెబాట పట్టేందుకు సమాయత్తమవుతున్నారు. ఫిబ్రవరి 7వ తేది నుంచి సమ్మె తప్పదని ఏపి మునిసిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కార్యదర్శి కె.పెంచలనరసయ్య చెప్పారు. మునిసిపల్ కార్మికుల సమస్యలపై వారు ఇటీవల ధర్నాందోళన చేశారు. కార్మికులను పర్మనెంట్ చెయ్యాలని, సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని, కరువు భత్యం, మధ్యంతర భృతిని మంజూరు చేయాలని కోరుతూ సమ్మె నిర్వహించనున్నామని తెలిపారు. నెల్లూరులో 60 ఏళ్ళు దాటిన మునిసిపల్ కార్మికులకు గత 9 నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పారిశుధ్య కార్మికులపై అధికారులు వేధింపులు, కక్షసాధింపులు మానుకోవాలన్నారు. ఈ సమస్యల స్థితిపై దశలవారీగా ఆందోళన చేపడతామన్నారు. ఫిబ్రవరి 5న జిల్లా కేంద్రాల్లో రిలే దీక్షలు చేస్తామని, 7 నుంచి సమ్మెలోకి వెళ్తామని తెలిపారు. సిపిఎం నాయకులు కత్తి శ్రీనివాసులు, అల్లాడి గోపాల్, సిఐటియు నాయకులు నాగేశ్వరరావు పాల్గొన్నారు. అనంతరం నగర మేయర్ స్రవంతికి కార్మికసంఘాల నాయకులు వినతిపత్రం అందజేశారు.

# గోపూజ ఎంతో పవిత్రమైనది



గోపూజ ఎంతో విశిష్టమైనది.. పరమ పవిత్రమైనదని, ప్రతిఒక్కరూ గోవులను పూజించుకోవాలని కోరుతూ ఇందుకూరుపేటకు చెందిన శ్రీ ఆంజనేయ ఫౌండేషన్ గౌరవాధ్యక్షుడు బండారు వెంకటరమణయ్య కరపత్రాలను పంపిణీ చేశారు. ఇటీవల ఇందుకూరుపేట మండలంలోని గంగపట్నంలో ఉన్న శ్రీ చాముండేశ్వరి అమ్మవారి దేవాలయంలో ఆ కరపత్రాలను ఆవిష్కరించి ప్రజలకు పంచారు. ఫౌండేషన్ అధ్యక్షుడు చిట్టిబోయిన వంశీకృష్ణ, ఆలయ అర్చకుడు అనిల్, ఆలయ సిబ్బంది వెంకురెడ్డి, సుందరయ్య తదితరులు పాల్గొన్నారు.

# జొన్నవాడ కామాక్షమ్మ దేవాలయానికి లక్ష విరాళం

జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని జొన్నవాడ కామాక్షమ్మ అమ్మవారి దేవాలయానికి సంబంధించిన నిత్యాన్నదాన సదనానికి తోటపల్లిగూడూరు మండలం సౌత్‌ఆములూరుకు చెందిన దాతలు ఆములూరు వీరయ్య, విజయమ్మ లక్ష వెయ్యినూటపదహారు రూపాయలు విరాళంగా అందజేశారు. ఈ నగదును గతనెల 30న ఆలయ ఇఓ ఏవి శ్రీనివాసులురెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా దాతలను ఇ.ఓ సత్కరించి అమ్మవారి తీర్థప్రసాదాలను, శేషవస్త్రాలను బహూకరించారు.

## విత్తనాభివృద్ధి సంస్థకు జాతీయస్థాయి అవార్డులు



విలేకర్లతో మాట్లాడుతున్న పేర్నాటి సుస్మిత

రాష్ట్ర విత్తనాభివృద్ధిసంస్థకు ఇటీవల రెండు జాతీయస్థాయి అవార్డులు లభించాయని ఆ సంస్థ ఛైర్‌పర్సన్ పేర్నాటి సుస్మిత తెలిపారు. ఇటీవల నెల్లూరులో ఆమె విలేకరులతో మాట్లాడారు. 2020-21 ఆర్థికసంవత్సర టర్నోవర్‌లో దేశంలోనే రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ రెండవస్థానంలో ఉందని చెప్పారు. కోవిడ్ కష్టకాలంలోనూ, తుఫాన్లు వరదల సమయాల్లోను రైతుభరోసా కేంద్రాల ద్వారా దాదాపు 20లక్షల మంది రైతులకు సబ్సిడీతో నాణ్యమైన విత్తనాలు సరఫరాచేశామని, ఇందుకు అవార్డు లభించిందని తెలిపారు. సిఎం జగన్‌మోహన్‌రెడ్డి సూచనలతో ఈ సంస్థను అభివృద్ధి బాటలో నడుపుతున్నామన్నారు. వైకాపా రాష్ట్ర కార్యదర్శి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, ఏపి సీడ్స్ జిల్లా మేనేజర్ శారద పాల్గొన్నారు.

## రిటైర్మెంట్ వయసు 60 నుంచి 62 ఏళ్ళకు

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల రిటైర్మెంట్ వయసు పెంచుతూ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీచేసింది. పదవీ విరమణ వయసును 60 నుంచి 62 ఏళ్ళకు పెంచుతూ గతనెల 31న ఆదేశాలిచ్చింది. ఇది ఈ ఏడాది జనవరి 1 నుంచి అమలులోకి వస్తుందని పేర్కొంది. ఆమేరకు ఆర్డినెన్స్ జారీకి గవర్నర్ కూడా ఆమోదం తెలియజేశారని సీనియర్ ఉద్యోగుల అనుభవాన్ని, నైపుణ్యాన్ని వినియోగించుకోవాలని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

## పట్టాలెక్కిన బిట్రగుంట ప్యాసింజర్

బిట్రగుంట -చెన్నై ప్యాసింజర్ రైలు మళ్ళీ పట్టాలెక్కింది. గత కొద్దిరోజులుగా రైల్వేట్రాక్ మరమ్మతులు జరుగుతుండడంతో ఆ రైలును నిలుపుదల చేసిన రైల్వే ఉన్నతాధికారులు గతనెల 31 నుంచి దీనిని నడపనున్నట్లు తెలిపారు.

## రెడ్‌క్రాస్ సేవలపై విద్యార్థులకు అవగాహన

విడవలూరులోని పి.ఆర్.ఆర్ అండ్ వి.ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. బి.సుజాత ఆధ్వర్యంలో యూత్ రెడ్‌క్రాస్ కమిటీ సహకారంతో విద్యార్థులకు రెడ్‌క్రాస్ సేవలపై అవగాహన కల్పించారు. అనంతరం కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా.ఎన్.మధు, కళాశాల యూత్ రెడ్‌క్రాస్ కన్వీనర్ డా.జి.పద్మప్రియ, జిల్లా యూత్ రెడ్‌క్రాస్ కన్వీనర్ డా.టి.శ్రీ రంజని, రాష్ట్ర రెడ్‌క్రాస్ సమన్వయకర్త డా. జి.రవికుమార్, డి.ఎఫ్.ఓలు వంశీ, శివప్రసాద్ పాల్గొన్నారు.

# గునపాటి ప్రసాద్‌రెడ్డి ఔదార్యం

**● ముదివర్తిపాళెం స్కూలుకు 3 లక్షల వితరణ**



ఇందుకూరుపేట మండలంలోని ముదివర్తిపాళెం ఉన్నత పాఠశాల ఇటీవల వచ్చిన భారీవర్షాలు, వరదలకు బాగా దెబ్బతినడంతో ఆ విషయం తెలుసుకున్న దాత గునపాటి ప్రసాద్‌రెడ్డి ఆ స్కూలు బాగుకు 3 లక్షల రూపాయలను విరాళంగా అందించి తన ఔదార్యం చాటుకున్నారు. నెల్లూరీయులైన ప్రసాద్‌రెడ్డి ప్రస్తుతం హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్ కోఛైర్మెన్‌గా అక్కడ తన సేవలందిస్తున్నారు. తాము నిర్వహిస్తున్న సప్తర్షి ఫౌండేషన్ ట్రస్ట్ ద్వారా తన తండ్రి గునపాటి హరిశ్చంద్రారెడ్డి జ్ఞాపకార్థం ముదివర్తిపాళెం స్కూలు అభివృద్ధికి తమవంతు చేయూతనందించి అందరి అభినందనలు అందుకున్నారు. విరాళం చెక్కును నెల్లూరులోని కళాలయ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షురాలు గూడూరు లక్ష్మీ, గూడూరు లక్ష్మణ్‌కుమార్‌రెడ్డిలకు పంపగా, వారు ఇటీవల పాఠశాల ఉపాధ్యాయుడు సదానందంకు ఆ విరాళాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో నేదురుమల్లి సుబ్బారెడ్డి, పాఠశాల విద్యాకమిటీ ఛైర్మెన్ వేణమ్మ, సర్పంచ్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# చెంగాళమ్మ అమ్మవారి గుడికి.. 90 వేల విరాళం



ఆలయ నిర్వాహకులకు విరాళం అందజేస్తున్న గౌతంరెడ్డి

సూళ్ళూరుపేటలోని శ్రీ చెంగాళ పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి నెల్లూరుకు చెందిన భక్తుడు బత్తెన గౌతంరెడ్డి గత నెల 28న 90వేలా 5 రూపాయలు విరాళంగా సమర్పించారు. ఆలయ ఇఓ ఆళ్ళ శ్రీనివాసులురెడ్డికి ఆ విరాళం మొత్తాన్ని అందజేశారు. దేవాదాయశాఖ సహాయ కమిషనర్ పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఇ.ఓ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# మహాత్ముని ఆశయాల బాటలో నడవాలి

**- పల్లిపాడు పినాకిని గాంధీ ఆశ్రమంలో ఏఎస్పీ వెంకటరత్నం**



జాతిపిత మహాత్మాగాంధీజీ చూపిన ఆశయాల బాటలో అందరూ నడవాలని ఏఎస్పీ వెంకటరత్నం పిలుపునిచ్చారు. గత నెల 30న గాంధీజీ వర్ధంతిని పురస్కరించుకుని ఇందుకూరుపేట మండలంలోని పల్లిపాడులో ఉన్న పినాకిని సత్యాగ్రహ ఆశ్రమంలో జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. తొలుత ఆశ్రమంలోని గాంధీజీ విగ్రహానికి, ఆశ్రమ స్థలదాత, ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధురాలు పొణకా కనకమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆశ్రమ కన్వీనర్ గణేశం కల్పనమ్మ, రెడ్‌క్రాస్ జిల్లా ఛైర్మెన్ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డితో పాటు ఆశ్రమంలో శాశ్వత అన్నదాత డాక్టర్ సిఆర్‌రెడ్డి సతీమణి ఇందిర, ఆశ్రమ సభ్యులు, రెడ్‌క్రాస్ సభ్యులు పాల్గొన్నారు. తొలుత చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

## సబ్‌జూనియర్ క్రీడాకారులకు 'నుడా' ఛైర్మెన్ ముక్కాల అభినందన



గుంటూరులో ఇటీవల జరిగిన ఆరవ రాష్ట్రస్థాయి అట్యాపాట్యా పోటీల్లో ద్వితీయ స్థానం సాధించిన నెల్లూరుజిల్లా సబ్ జూనియర్స్ బాలికల జట్టును ఈనెల 28న నుడా ఛైర్మెన్ ముక్కాల ద్వారకానాథ్ తన కార్యాలయంలో జ్ఞాపికలతో సత్కరించారు. జాతీయస్థాయికి ఎంపికైన బాలికలు వై.ధనలక్ష్మీ, సుమన, పి.మనోజులను, బాలురు కె.సంతోష్, బి.నాని, కార్తికేయలను అభినందించి వారికి మరింత శిక్షణ ఇవ్వాలని కోచ్‌లను కోరారు. క్రీడాసంఘం ప్రతినిధులు నిమ్మల వీర వెంకటేశ్వర్లు, అట్యాపాట్యా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కె.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



# ఉప్పెనై ఉరిమిన ఉద్యోగులు

## ○ చలో విజయవాడ విజయవంతం

ఫిబ్రవరి 7వతేది నుండి తాము తలపెట్టిన సమ్మెకు మద్దతుగా ఫిబ్రవరి 3వ తేదీన 'చలో విజయవాడ' పేరుతో మహా ధర్నాకు పిఆర్‌సి సాధన సమితి సభ్యులు పిలుపునిచ్చారు. నాలుగు ఉద్యోగ సంఘాలూ ఏకమై ఈ కార్యక్రమం కోసం పోలీసు శాఖని అనుమతి కూడా కోరారు. అయితే కోవిడ్ కారణంగా ఉన్న నిబంధనల మేరకు, 5వేల మందితో కార్యక్రమాన్ని నిర్వహించడానికి అనుమతి ఇవ్వలేమంటూ నిరాకరించింది.

మరోవైపు ప్రభుత్వ పెద్దలు, సలహాదారులూ ఉద్యోగులను బెదిరిస్తూనే వచ్చారు. హద్దుమీరితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిస్తూనే ఉన్నారు. ఇదే తరుణంలో రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాలలో పోలీసులను అప్రమత్తం చేశారు. ప్రధాన నాయకులందరినీ గృహ నిర్బంధంలో ఉంచారు. బస్టాండ్లు, రైల్వేస్టేషన్‌లలో గట్టి నిఘా ఉంచారు. విజయవాడ వైపు వెళ్ళే మార్గాలన్నిటిలోను బందోబస్తు పెట్టి ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించి వదిలిపెట్టారు. ఇక ఉద్యోగుల సభ విఫలం అన్న ధీమాతో 2వతేదీ రాత్రి నిద్రపోయారు.

అయితే 3వతేదీ ఉదయం పుట్టలో నుండి చీమలు వచ్చినట్లుగా ఉద్యోగులు విజయవాడ నగరంలో రోడ్లపైకి రావడం మొదలుపెట్టారు. ఎక్కడి నుండి వస్తున్నారు, ఎక్కడికి వెళ్తున్నారు... అని పోలీసుశాఖ గమనించేలోగానే కొన్ని వేలమంది బిఆర్టీఎస్ రోడ్డులో గుమిగూడిపోయారు. సుమారు లక్షమందికి దాకా ఈ ఉద్యోగ సమూహం ఉంటుందని మేధావులు అంచనా వేస్తున్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి సభలను తలపించేలా ఈ నిరసన సభ జరిగిందని అంటున్నారు.

### ఎక్కడ తప్పులో కాలేశారో


తాము ఎన్ని ముందు జాగ్రత్తలు తీసుకున్నా ఎక్కడ తప్పులో కలిశారో అర్థంకాక పోలీసులు తలపట్టుకున్నారు. ప్రభుత్వ పెద్దలూ, సలహాదారులూ సైతం ఉప్పెనలా వచ్చిన ఉద్యోగ సంఘాలను చూసి ఖంగుతిన్నారు. ఒక్కసారిగా ప్లేటు మార్చి తాము ఎవరినీ నివారించలేదని, ఎలాంటి నిషేదాజ్ఞలు విధించలేదని ప్రకటనలిచ్చారు. అటు ఉద్యోగులు... ఇటు ప్రభుత్వం తాము పట్టిందే పట్టుగా వ్యహరిస్తున్నారు. ఈ తరుణంలో విజయవాడ సభ విజయవంతం కావడంతో ఉద్యోగ సంఘ నాయకులు ఒకడుగు ముందుకు వేశారు. ఫిబ్రవరి 7వతేది నుండి మొదలుపెట్టనున్న సమ్మెకు అంకురార్పణగా 5వ తేదీ నుండే సహాయ నిరాకరణ కార్యక్రమం చేపట్టనున్నట్లు సంచలన ప్రకటన చేశారు.

### నడిపించిన ఆ నలుగురు..



సూర్యనారాయణ వెంకటేశ్వర్లు వెంకటరామిరెడ్డి శ్రీనివాసరాజు

ప్రభుత్వం తమని ఎన్ని విధాలుగా భయపెట్టినా 'తగ్గేదే లే' అని ముందునుండి ప్రకటిస్తూ వచ్చిన నాలుగు ఉద్యోగ సంఘాల నాయకులు తమ మాటకు కట్టుబడే ముందుకు సాగుతున్నారు. ఎవ్వరికీ అంతుచిక్కని తరహాలో వ్యూహం రచించి వేలాది మందిని విజయవాడ రప్పించడంలో ఆ నలుగురు విజయం సాధించారు. నాలుగు సంఘాల నాయకులు సూర్యనారాయణ, వెంకటేశ్వర్లు, వెంకటరామిరెడ్డి, శ్రీనివాసరాజుల ఐకమత్యమే ఈ విజయవాడ సభ విజయానికి కారణమని, ఉద్యోగుల రేపటి విజయానికి ఇది నాంది... అని విజయవాడ సభలో పాల్గొన్న వివిధ సంఘాల జిల్లా ప్రతినిధులు నినాదాలు చేశారు. ఉప్పెనై ఉరిమిన తమను వెనకుండి ముందుకు నడిపించింది ఆ నలుగురే అని వారు పేర్కొన్నారు. ఏదిఏమైనా ఇక్కడ గెలిచింది ఎవరు, ఓడింది ఎవరు అన్నది అప్రస్తుతం. ఇప్పటికైనా ఇంటెలిజెన్స్ వ్యవస్థల ద్వారా వాస్తవ పరిస్థితులను తెలుసుకుని అందుకు అనుగుణంగా ప్రభుత్వం చర్యలు చేపడితే తప్ప ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం దొరకదు.



# కొత్త సహకార విధానం ఏ మేరకు లక్ష్యాలు సాధిస్తోంది?

'సహకార్ సే సమృద్ధి' లక్ష్యాలేమిటి?.. ప్రతిపాదిత కొత్త సహకార విధానం ద్వారా మంత్రిత్వ శాఖ ఆ లక్ష్యాలను ఏ మేరకు సాధిస్తుందని రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఈనెల 2న పార్లమెంట్‌లో ప్రశ్నించారు. రాష్ట్రాల నుండి, ఇతర వాటాదారుల నుండి సహకార విధానంపై సూచనలు స్వీకరించారా?.. అలా అయితే వాటి వివరాలు తెలపాలని ప్రశ్నించారు. అందుకు స్పందించిన కేంద్ర మంత్రి అమిత్‌షా, ఈ విధానం ద్వారా దేశంలో సర్వతోముఖాభివృద్ధి సాధించడమే ప్రభుత్వ లక్ష్యమని సమాధానమిచ్చారు. పారదర్శకత, ఆధునికీకరణ, పోటీ తత్వాన్ని సృష్టించడం ద్వారా సహకార సంఘాలను బలోపేతం చేయాలని, దీని కోసం దేశంలోని వివిధ మంత్రిత్వ శాఖలు, కేంద్ర ప్రభుత్వాల విభాగాలతో, రాష్ట్ర ప్రభుత్వాలు, సహకార సమాఖ్యలు, నాబార్డ్ మరియు ఇతర ప్రధాన సహకార సంస్థలతో సహా వివిధ వాటాదారులతో సంప్రదింపులు ప్రారంభించిందని తెలిపారు. ఇప్పటికే 35 మంది వాటాదారులు, 10 మంత్రిత్వ శాఖలు, 6 రాష్ట్ర ప్రభుత్వాల నుండి ప్రతిస్పందన వచ్చిందని కేంద్రమంత్రి తెలిపారు.

### పిఎం పోషణ్ పథకంలో సాధ్యాసాధ్యాలేమిటి?..

పి.ఎం పోషణ్ పథకంలో మిల్లెట్‌లను పరిచయం చేసే విషయమై ప్రభుత్వం రాష్ట్రాలను సాధ్యాసాధ్యాలను అన్వేషించాలని కోరిన విషయం వాస్తవమేనా?..వాటి వివరాలేమిటని ఎంపీ వేమిరెడ్డి ఈనెల 3న పార్లమెంట్‌లో అడిగారు. మధ్యాహ్న భోజనం తయారీలో మినుములను అందించడానికి కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు ఆర్థిక సహాయం అందించలేకపోవడానికి గల కారణాలను తెలపాలని ప్రశ్నించారు. అందుకు స్పందించిన కేంద్రమంత్రి అన్నపూర్ణాదేవి సమాధానమిస్తూ పిల్లల్లో పోషకాహారాన్ని పెంపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం, ప్రధానమంత్రి పోషణ్ పథకం కింద ప్రధానంగా మిల్లెట్లు ఇవ్వడానికి గల అవకాశాలను అన్వేషించాలని ప్రతిపాదించడం జరిగిందన్నారు.



పార్లమెంట్‌లో ఎంపీ విపిఆర్ ప్రశ్న

### న్యాయమూర్తుల ఖాళీల భర్తీకి తీసుకుంటున్న చర్యలేమిటి?

న్యాయమూర్తుల ఖాళీల విషయాన్ని ప్రస్తావిస్తూ దాదాపు 50 శాతం న్యాయమూర్తుల పోస్టులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఖాళీగా ఉన్నాయన్నది వాస్తవం కాదా?.. ఈ పోస్టులు ఎప్పటి నుంచి ఖాళీగా ఉన్నాయి? ఖాళీలను భర్తీ చేయడానికి ప్రభుత్వం చేసిన ప్రయత్నాలేమిటి?.. అని విపిఆర్ ప్రశ్నించగా, అందుకు స్పందించిన కేంద్రమంత్రి కిరెన్ రిజిజు ఆంధ్రప్రదేశ్ హైకోర్టును 2019 జనవరి 1న ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ ఏడాది జనవరి 31నాటికి ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో 37 మంది న్యాయమూర్తులకుగాను 20 మంది న్యాయమూర్తులు ఉన్నారని, 17 మంది న్యాయమూర్తుల ఖాళీలను భర్తీ చేయవలసి ఉందని తెలిపారు.

# పొగాకు బోర్డును కొనసాగించండి

### - కేంద్రమంత్రికి ఎంపీ ఆదాల వినతి



ఎన్నో పోరాటాల తర్వాత ఏర్పడిన పొగాకు బోర్డును కొనసాగించాలని నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి కేంద్ర వాణిజ్య పరిశ్రమల శాఖ మంత్రి పియూష్ గోయల్‌ను ఈనెల 2న ఢిల్లీలో కలిసి అభ్యర్థించారు. ఆ మేరకు ఒక లేఖను ఆయనకు సమర్పించారు. ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు, ప్రకాశం జిల్లాలతో పాటు దేశంలోని 6 జిల్లాల్లో వర్జీనియా పొగాకు సాగవుతోందని, రైతులు తమ పంటలను విక్రయించుకోవడానికి ఒక వేదికగా 1978 జనవరి1న పొగాకు బోర్డు ఏర్పడిందని, ఆ పొగాకు బోర్డు కార్యాలయాల్లో పొగాకును వేలం వేయడం ద్వారా స్థిరమైన ధర, సత్వర చెల్లింపు లభించడంతోపాటు పారదర్శకత పాటిస్తోందని తెలిపారు. పొగాకు రైతులకు ఉపయోగకరమైన సమాచారం, సాంకేతిక మద్దతు కూడా అందిస్తోందని పేర్కొన్నారు. అలాంటి పొగాకు బోర్డును మూసివేయడం, బోర్డు అధికారాలను నియంత్రించడంతో పాటు కాంట్రాక్ట్ ఫార్మింగ్ గురించి చర్చలు జరుగుతున్నాయని, పొగాకు బోర్డు కార్యకలాపాలను మందగింపచేయవద్దని రైతు కుటుంబాల తరపున విజ్ఞప్తి చేస్తున్నట్లు ఆదాల పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు మాగుంట శ్రీనివాసులురెడ్డి, మార్గాని భరత్, శ్రీకృష్ణదేవరాయలు పాల్గొన్నారు.




## 'ప్రభా'తం

దాదాపు రెండేళ్ళుగా కోవిడ్ మహమ్మారి వ్యాధి దెబ్బకు దేశంలో అన్ని వ్యవస్థలు, అన్ని రంగాలు అతలాకుతలమైపోయాయి. తాజాగా కేంద్రం ప్రకటించిన బడ్జెట్ కరోనాతో వణుకుతున్న సాదాసీదా జనానికి, మధ్య తరగతి కుటుంబాలకి కాస్తంత ఊరటగా ఉందనుకుంటే అది కూడా ఊరించిందే తప్ప ఊరట కలిగించలేదు. ధరల భారంతో నడవలేక నడుస్తున్న పేదల జీవితాలు కానీ, అప్పుల నిప్పులగుండంలో పడి విలవిలలాడుతున్న రైతన్నలకు కానీ బడ్జెట్‌లో ఉపశమనాలు లేవు. పెట్రోలు, గ్యాస్ వంటి అత్యవసరాల ధరలు పెరగడంతో, నిత్యావసరాల ధరలు కూడా ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోయాయి. దేశ ప్రజల జీవన ప్రమాణాలు పెరిగేవిధంగా బడ్జెట్ ఉంటుందని, ఇది అత్యద్భుతమైన బడ్జెట్ అని కేంద్రం పెద్దపెద్ద పదాలతో ఊరించినా చివరికి మిగిలిందేమీ లేదు.. నిరాశ తప్ప. ముఖ్యంగా కరోనా కాలంలో ఉపాధిహామీ పథకం పేదల కుటుంబాలకు అండగా నిలిచి ఆదుకుంది. ఆ పథకానికి ఇప్పుడు కనీసం రెండున్నర లక్షల కోట్లకు పైగానే నిధుల అవసరం ఉంది. కానీ బడ్జెట్‌లో మాత్రం కేవలం 73వేల కోట్ల రూపాయలే కేటాయించడంతో కష్టజీవుల భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది. ఉపాధి హామీ పథకానికి 25 శాతం దాకా కోతపెట్టేసింది. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగం మరింతగా ప్రబలుతుంది. దేశంలో ఇప్పటికే కోట్లాదిమంది పేదలు పనులు లేక రోడ్డున పడ్డారు. వారిని ఆదుకునేందుకు ఈ బడ్జెట్‌లో ఎలాంటి కేటాయింపులు లేకపోవడం అందరినీ ఆవేదనకు గురిచేస్తోంది. ఆదాయపు పన్ను పరిమితిని పెంచి కొంతలో కొంత ఊరట కలిగిస్తారేమోనని ఆశపడ్డ మధ్యతరగతి వేతన జీవులకు కూడా ఈ బడ్జెట్‌లో ఎలాంటి ఉపశమనం లేకపోవడం విచారించదగ్గ విషయం. అయితే బడ్జెట్‌లో హర్షించదగ్గ అంశాలు కూడా ఎన్నో ఉన్నాయి. 2022-23 ఆర్థికసంవత్సరానికి దాదాపు 39.45 లక్షల కోట్లతో రూపొందించిన బడ్జెట్ ఇది. ద్రవ్య స్థిరీకరణ కంటే ఆర్థిక వ్యవస్థ విస్తరణకి బడ్జెట్‌లో ప్రాధాన్యత ఇవ్వడం, మూలధనం వ్యయం పెంచేందుకు నిర్ణయించడం వంటివన్నీ మంచివే. విద్య, వైద్యం, ఆర్థికం, వ్యవసాయం ఇలా అన్ని రంగాలను డిజిటల్ సాంకేతిక బాటపట్టించేందుకు ఉత్సాహం చూపారు. ప్రగతి రథాన్ని పరుగులు తీయించడానికి రహదారులు, రైల్వే, విమానాశ్రయాలు, ఓడరేవులు, ప్రజారవాణా, జలమార్గాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చారు. నదులను అనుసంధానిస్తామని, రానున్న మూడేళ్ళలో నాలుగువందల 'వందే భారత్' రైళ్ళను సిద్ధం చేస్తామని చెప్పారు. ముఖ్యంగా రక్షణ వ్యవస్థ బలోపేతానికి మునుపెన్నడూ లేనంతస్థాయిలో కేటాయింపులు చేయడం ఎంతైనా సంతోషకరం. రైతులకు సేంద్రియసాగు, నూనెగింజల ఉత్పత్తికి ప్రోత్సాహం ఇస్తామనడం మంచిదే. కానీ రైతుల ఆదాయాలను భారీగా పెంచి వారి జీవనాన్ని కష్టాల నుంచి గట్టెక్కిస్తామని మొన్నటిదాకా గొప్పలు చెప్పుకున్న కేంద్రం ఇప్పటి బడ్జెట్‌లో ఆ విషయాలేమీ లేకపోవడం, ఎరువులపై దాదాపు 3 వేల కోట్లకు పైగానే సబ్సిడీలు ఎత్తివేయడం అన్నదాతల నడ్డి విరవడం కాక మరేమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు. అంతేకాదు, అత్యవసర రుణ హామీ పథకంతో ఎంఎస్ఎంఇలకు ఎంతో ప్రయోజనకరంగా ఉందంటూ దానిని మరో ఏడాది పొడిగించాలనుకోవడం హర్షదాయకమే అయినా ఆ పథకంతో లబ్ధిపొందిన కంపెనీల సంఖ్య చాలా తక్కువేనని, కరోనా కారణంగా మూతపడిన వేలాది పరిశ్రమలు నేటికీ ఇంకా తలుపులు తెరుచుకోలేదని పారిశ్రామిక వర్గాలంటున్నాయి. విద్యార్థులకు ఫోన్లు, రైతులకు డ్రోన్లు, టీచర్లకు టీవీలు.. ఇలా ఇక దేశమంతా డిజిటల్ భారత్‌గా వచ్చేస్తుందంటూ పేదలకు కూడా ఇంటర్నెట్లు ఇస్తామంటూ ప్రకటించారు. సంతోషించేలోగానే కీలెరిగి వాతపెట్టినట్లుగా ఆహారసబ్సిడీలో 80 వేల కోట్లు కోత పెట్టారు. చివరికి మహిళల అభ్యుదయానికి కానీ, వారి జీవనప్రమాణాలు పెంచేందుకు కానీ ఎలాంటి ఆలోచనలు చేయలేదు. మొత్తమ్మీద ఈసారైనా తియ్యగా ఉంటుందనుకుంటున్న బడ్జెట్ చేదుగానే ఉండడం అత్యధికశాతం మంది ప్రజలను అసంతృప్తికి గురిచేసిందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. ప్రత్యేకించి ఆంధ్రరాష్ట్రానికి కూడా నిర్మలమ్మ బడ్జెట్ నిరుత్సాహాన్నే కానుకగా ఇచ్చింది. విభజన హామీల ఊసే లేదు. రాష్ట్రంలో రెవెన్యూ లోటుకు ఎలాంటి హామీ లేదు. ఈ బడ్జెట్‌లో భారీగా నిధులొస్తాయనుకున్న పోలవరంపై కానీ, విశాఖ రైల్వేజోన్ విషయం కానీ అసలు ప్రస్తావనకు కూడా రాలేదు. ఎంతో కీలకమైన అంశాలను కూడా కావాలనే దాటవేసి కేంద్రం రాష్ట్రానికి మొండిచెయ్యి చూపించిందనే అసంతృప్తి సర్వత్రా వెల్లువెత్తుతోంది. అయినా ఎన్ని గొప్ప బడ్జెట్‌లు వస్తున్నా సామాన్య, మధ్యతరగతి ప్రజలకు ఒరిగేదేమీ ఉండడం లేదు. దేశంలో నానాటికీ నిరుద్యోగం, పేదరికం, ఆకలికేకలు పెరుగుతున్నాయే తప్ప తరగడం లేదు. పేదలకు, దేశానికి అన్నంపెట్టే రైతన్నలకు, కష్టజీవులకు, కార్మికులకు మాత్రం వీటివల్ల ఎలాంటి ప్రయోజనం ఉండడం లేదు. ప్రపంచంలో మరెక్కడా లేనంతగా మనదేశంలో ఆర్థిక అసమానతలు పెరిగిపోతూనే ఉన్నాయని నిపుణులు పదేపదే హెచ్చరిస్తున్నా వాటిపై దృష్టిపెట్టేవారే కరువయ్యారు. సరైనా పోషకాహారం లేక కోట్లాదిమంది పిల్లలు అనారోగ్యం పాలవుతున్నారు. నిరుద్యోగులు ఆకలితో అల్లాడిపోతున్నారు. ఒకవైపు కరోనా, మరోవైపు ఆర్థిక ఇబ్బందులతో అణగారిపోతున్న దేశప్రజలకు కొంతలో కొంతైనా ఊరట కలిగించి ఉంటే బావుండేదనే అభిప్రాయాలే సర్వత్రా వినపడుతున్నాయి. భవిష్యత్తులోనైనా పేదలను, అభాగ్యులను, నిరుద్యోగులను, కష్టజీవులను, అన్నదాతలను, మహిళలను, విద్యార్థులను, చిన్నారులను ఇలా అన్నివర్గాల ప్రజల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని వారి కష్టాల్లో ఆదుకునేందుకు అండగా నేనున్నాననే భరోసా బడ్జెట్‌ను ప్రవేశపెట్టాలి. ప్రజలకు ఏది మేలైనదో ఆలోచించి అలాంటి ప్రజోపయోగకరమైన బడ్జెట్‌ను రూపొందించాలన్నదే ప్రజల ఆకాంక్ష!..

### ఊరట కలిగించని.. బడ్జెట్

**కేంద్రబడ్జెట్ ఈసారి కూడా నిరాశగానే ఉంది. ఇది అత్యద్భుతమైన బడ్జెట్ అని కేంద్రం ఊరించినా చివరికి మిగిలిందేమీ లేదు..నిరాశ తప్ప. పేదలు, అన్నదాతలు, మహిళలు, మధ్యతరగతి ప్రజలకు కనీసం ఊరడింపు కూడా లేదు. ముఖ్యంగా కరోనా కాలంలో ఉపాధిహామీ పథకం పేదల కుటుంబాలకు అండగా నిలిచి ఆదుకుంది. ఆ పథకానికి కూడా కోతపెట్టారు. దేశంలో కోట్లాదిమంది పేదలు పనులు లేక రోడ్డునపడ్డారు. వారిని ఆదుకునేందుకు ఈ బడ్జెట్‌లో ఎలాంటి కేటాయింపులు లేవు. ఆదాయపు పన్ను పరిమితిని పెంచి కొంతలో కొంత ఊరట కలిగిస్తున్నారని ఆశపడ్డ మధ్యతరగతి వేతన జీవులకు కూడా ఈ బడ్జెట్‌లో ఉపశమనం లేకపోవడం విచారకరం.**

## ఆ నల్ల జీఓలను రద్దు చేయాల్సిందే

### ఉద్యోగులు, ఉపాధ్యాయుల డిమాండ్



కలెక్టరేట్ వద్ద రిలే దీక్షలు చేస్తున్న ఉద్యోగులు

తమ జీతభత్యాల్లో కోత పెడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆ నల్ల జీఓలను వెంటనే రద్దు చేయాల్సిందేనని, అశుతోష్‌మిశ్రా రూపొందించిన పిఆర్‌సి నివేదికను బయటపెట్టాలని నెల్లూరులోని ఉద్యోగులు, ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున డిమాండ్ చేశారు. గతనెల 30న నెల్లూరు కలెక్టరేట్ ఎదుట పిఆర్‌సి పోరాట సాధన సమితి సారధ్యంలో వారంతా రిలే నిరాహారదీక్షలు చేశారు. నాలుగురోజుల దీక్ష అనంతరం ఆ సమితి నాయకులు మన్నేపల్లి పెంచలరావు, అల్లంపాటి పెంచలరెడ్డి, ఏనుగు రమణారెడ్డి, చేజర్ల సుధాకర్‌రావు తదితరులు మాట్లాడుతూ తమకు న్యాయమైన పిఆర్‌సి ఇచ్చేంతవరకు ఆందోళనలు కొనసాగిస్తామన్నారు. ప్రభుత్వం న్యాయమైన తమ డిమాండ్లను మళ్ళీ పరిశీలించి తమకు న్యాయం చేయాలన్నారు. పలు సంఘాల నాయకులు వెంకటస్వామి, చెంచురామయ్య, మల్లికార్జున, మురళీధర్, విజయకుమార్ పాల్గొన్నారు. ఏపి రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ఉద్యోగులు ప్రదర్శనగా వచ్చి ఈ ఆందోళనకు తమ మద్దతు ప్రకటించారు. హెడ్‌మాస్టర్ల సంఘం నాయకుడు చలపతి, ఆర్టీసీ యూనియన్ల, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, మునిసిపల్‌శాఖ, వైద్యశాఖ, పంచాయతీరాజ్, ట్రెజరీ, జడ్పీ తదితర అన్నిశాఖల ఉద్యోగులు ఈ ఆందోళనలో పాల్గొన్నారు. తొలుత ఉద్యోగ సంఘాల నాయకులు గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



క్రీడాకారులను అభినందిస్తున్న హాకీ అసోసియేషన్ సభ్యులు

## రాష్ట్రస్థాయి హాకీలో సత్తాచాటిన నెల్లూరు క్రీడాకారులు

విశాఖపట్నంలోని యలమంచిలిలో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి బాలుర జూనియర్ హాకీ పోటీల్లో నెల్లూరుజిల్లా జట్టు తమ సత్తా చాటింది. ఈ పోటీల్లో ద్వితీయస్థానం సాధించి అందరి అభినందనలు అందుకుంది. ఆ జట్టు క్రీడాకారులను నెల్లూరులో జిల్లా హాకీ అసోసియేషన్ అధ్యక్షుడు థామస్‌పీటర్ అభినందిస్తూ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో క్రీడా ప్రతినిధులు అబ్రహం కుమార్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## తూకాల మోసాలను అరికట్టండి




మార్కెట్లలో తూనికలు కొలతలకు సంబంధించి మోసాలు యధావిధిగా జరిగిపోతూనే ఉన్నాయి. అనేకమంది వ్యాపారులు ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా తీసుకుని కొలతల్లో మాయచేసి తమ పబ్బం గడుపుకుంటున్నారు. ఇటీవలే తూనికలు కొలతల అధికారులు పలు చేపల దుకాణాల్లో తనిఖీలు నిర్వహించినప్పుడు కిలోకి సుమారు 300 గ్రాములకు పైగానే తక్కువ తూకం ఇస్తున్నారని వెల్లడైన విషయం చూస్తే జనం ఎంతగా మోసాల బారిన పడుతున్నారో అర్థమవుతుంది. నెల్లూరు నగరంలోనే పెద్దసంఖ్యలో దుకాణాలు, చిల్లరవ్యాపారులు లెక్కలేనన్ని ఉన్నాయి. సందులు గొందుల్లో ఎన్నో అంగళ్ళున్నాయి. వాటిలో ఏమిచ్చినా, ఎంత తక్కువ తూకంతో ఇచ్చినా చూసేవారెవరు?.. పట్టించుకునే వారెవరు?.. సాధారణ పేద జనాన్ని మాయచేసి నవ్వుతూనే కుచ్చుటోపీ పెట్టడం అనేకమంది వ్యాపారులకు వెన్నతో పెట్టిన విద్యగా ఉంటోంది. చాలా తెలివిగా, జాగ్రత్తగా అమాయక జనాన్ని తూకాల్లో బురిడీ కొట్టించేస్తుంటారు. అధికారులు తనిఖీలకు వస్తున్నారనే సమాచారాన్ని ముందుగానే తెలుసుకుని జాగ్రత్తపడుతుంటారు. అనేకమంది వ్యాపారులు ఎంతోకాలం నుంచి ఇలా అక్రమార్జన చేస్తూనే ఉన్నారు. సరుకును తెచ్చుకునేటప్పుడు వ్యాపారులు తూకం బాగానే చూసుకుని తెచ్చుకుంటారు. వాటిని తిరిగి అమ్మేటప్పుడు జనానికి చాలా తక్కువ తూకంతో ఇస్తుంటారు. చేపల దుకాణాల్లో, కూరగాయల అంగళ్ళలో.. అన్ని రకాల సరుకుల విక్రయాల్లో ఈ తంతు జరిగిపోతూనే ఉంది. తూనికలు, కొలతల శాఖ అధికారులు బృందాలుగా ఏర్పడి జిల్లావ్యాప్తంగా ప్రతిచోటా ఆకస్మిక తనిఖీలు చేసి ఈ మోసాలను అరికట్టాలి.

**డి.సి నారాయణమ్మ, నెల్లూరు.**

## ఎండ్లూరి కవితా ప్రతిభ అమోఘం

### - పెరసం నివాళి

ప్రముఖ కవి, కేంద్ర సాహిత్య అకాడమీ సభ్యుడు ఎండ్లూరి సుధాకర్ మృతికి నెల్లూరులోని పెన్నా రచయితల సంఘం (పెరసం) సంతాపం వెలిబుచ్చింది. స్థానిక కరెంటాఫీసు వద్ద ఉన్న శ్రీ వేంకటేశ్వర విద్యాలయంలో గతనెల 31న ఎండ్లూరి సంతాపసభ జరిగింది. ఎండ్లూరి కవితాప్రతిభను ఈ సందర్భంగా కవులు కొనియాడారు. పెరసం ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌బాబుతో పాటు బాలసాహితీవేత్త డా.గంగిశెట్టి శివకుమార్, కవులు బొగ్గరపు రాధాకృష్ణ, అల్లాడి వేణుగోపాల్, కృష్ణయ్య, కవయిత్రులు సుభద్రాదేవి, తోట సులోచన, నస్మ తదితరులు పాల్గొని ఎండ్లూరి మృతికి నివాళులర్పించారు.



## టెన్త్ పరీక్ష ఫీజుల గడువు పెంచాలి

10వ తరగతి పరీక్షల ఫీజులు కట్టేందుకు విద్యార్థులకు కొంత వెసులుబాటు కల్పిస్తూ ప్రభుత్వం గడువు తేదీలను పొడిగిస్తే బావుంటుంది. 2021-22 విద్యా సంవత్సరం కోవిడ్ నేపథ్యంలో ఆలస్యంగా ప్రారంభమైంది. ఆధార్ అనుసంధానంలో ఇబ్బందులు, కరోనా దెబ్బకు భయపడి విద్యార్థులు తరగతులకు సక్రమంగా హాజరుకాలేకపోవడం, అనేక పాఠశాలల్లో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు కూడా కరోనా సోకడం.. ఇలాంటి కారణాల వల్ల పరీక్షల పట్ల విద్యార్థులు ఆశించిన స్థాయిలో ఆసక్తి చూపలేకపోతున్నారు. పరీక్ష ఫీజులు కట్టేందుకు మరో రెండుమూడు వారాలపాటైనా గడువును పెంచితే విద్యార్థులు విద్యాసంవత్సరాన్ని నష్టపోకుండా ఉంటారన్నది నా విన్నపం.

**కె.మల్లికార్జునరావు, కోవూరు.**

# కొత్త జిల్లాల ఏర్పాటుకు రెడీ

## 35 మండలాలు, 3 డివిజన్లతో శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా

ఎట్టకేలకు ప్రభుత్వం అనుకున్నరీతిలో కొత్త జిల్లాల ఏర్పాటు వేగవంతమవుతోంది. పాలనా సౌలభ్యం కోసం కొత్త జిల్లాల ఏర్పాటుకు ప్రభుత్వ సూచనలతో జిల్లా అధికార యంత్రాంగం ఇటీవల గెజిట్‌ను విడుదల చేసింది. ఇందులో భాగంగా నెల్లూరు, బాలాజీ జిల్లాల ఏర్పాటుపై జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ అంశంపై అన్నివర్గాలు, అన్ని ప్రాంతాల నుంచి సూచనలు, సలహాలు, అభ్యంతరాలను నెలరోజుల్లోగా స్వీకరించాలని నిర్ణయించారు.

### శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా :

9,141 చదరపు కిలోమీటర్ల భౌగోళిక స్వరూపంతో, 23.37 లక్షల జనాభాతో శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లాను ఏర్పాటు చేస్తున్నామని గెజిట్‌లో పేర్కొన్నారు. కావలి, కోవూరు, ఆత్మకూరు, ఉదయగిరి, నెల్లూరు నగరం, నెల్లూరు గ్రామీణం, సర్వేపల్లి అసెంబ్లీ నియోజకవర్గాలతో పాటు కందుకూరును కలిపి నెల్లూరుజిల్లాగా ఏర్పాటుచేస్తున్నట్లు గెజిట్‌లో తెలిపారు. గూడూరు, సూళ్ళూరుపేట, వెంకటగిరి నియోజక వర్గాలను తిరుపతిలో కలిపి శ్రీబాలాజీ జిల్లాగా ఏర్పాటు చేస్తున్నారు. ఆ మేరకు ముసాయిదాను సిద్ధం చేస్తున్నారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లాలో 35 మండలా లతో పాటు నెల్లూరు, ఆత్మకూరు, కావలి రెవెన్యూ డివిజన్లుగా ఏర్పాటవుతున్నాయి. కృష్ణపట్నం, రామాయపట్నం పోర్టులు నెల్లూరుజిల్లాలోనే ఉండడం వల్ల వేలాదిమందికి ఉపాధి దొరుకుతుందని, మరో 8 పారిశ్రామిక హబ్‌లు కూడా ఏర్పాటు కానున్నాయని కలెక్టర్ ఈ సందర్భంగా తెలిపారు.

### శ్రీ బాలాజీ జిల్లా :

అదేవిధంగా కొత్తగా ఏర్పాటుకానున్న శ్రీబాలాజీ జిల్లాలో గూడూరు, సూళ్ళూరుపేట, వెంకటగిరి, సత్యవేడు, శ్రీకాళహస్తి, తిరుపతి, చంద్రగిరి అసెంబ్లీ నియోజకవర్గాలు ఉంటాయి. ఈ జిల్లా 22.18 లక్షల జనాభాతో 9,176 చదరపు కిలోమీటర్ల భౌగోళిక విస్తీర్ణంతో ఏర్పడనుంది. తిరుపతి కేంద్రంగా ఉండే ఈ జిల్లాలో కూడా 35 మండలాలతో పాటు గూడూరు, నాయుడుపేట, తిరుపతి రెవెన్యూ డివిజన్లుంటాయి.

## ప్రజారోగ్యాన్ని పరిరక్షించేవే..

# సామాజిక ఆరోగ్యకేంద్రాలు

**– జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు**



వైద్య పరికరాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాకాణి, జిల్లా కలెక్టర్

ప్రజారోగ్యాన్ని పరిరక్షించేవే.. సామాజిక ఆరోగ్యకేంద్రాలని, జిల్లాలోని అన్ని ప్రాథమిక, సామాజిక ఆరోగ్యకేంద్రాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్ బాబు చెప్పారు. మండల కేంద్రమైన వెంకటాచలంలోని సామాజిక ఆరోగ్యకేంద్రంలో సిఫ్ట్రో రిలీఫ్ కంపెనీవారు వసంతలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సమకూర్చిన వైద్య పరికరాల వితరణ గతనెల 31న జరిగింది. సర్వేపల్లి శాసనసభ్యులు శ్రీ కాకాణి గోవర్ధన్ రెడ్డి తో కలిసి జిల్లా కలెక్టర్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సామాజిక ఆరోగ్యకేంద్రాలు ప్రజారోగ్య వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్నాయని, గ్రామాల్లో వైద్య శిబిరాలు, 104 సంచార వాహనాలు 24 గంటలు అన్ని వసతులతో అత్యవసర వైద్య సేవలను ప్రజలకు అందిస్తున్నాయని అన్నారు. అన్ని ఆరోగ్య కేంద్రాలను పూర్తిస్థాయిలో బలోపేతం చేసేలా అత్యాధునిక వైద్య పరికరాలు, ఆక్సిజన్ ఏర్పాట్లు, ఖరీదైన మందులను సిద్ధం చేసినట్లు తెలిపారు. కోవిడ్‌ను ఆరోగ్యశ్రీలో చేర్చి పేదలకు పూర్తిగా ఉచితవైద్యం అందేలా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నారని, దేశంలో ఏ రాష్ట్రంలో కూడా ఆరోగ్యశ్రీ పరిధిలోకి కోవిడ్‌ను చేర్చలేదని అన్నారు. జిల్లాలో 1.75 లక్షల మంది కరోనా రోగులకు ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా వైద్యసేవలు అందించామన్నారు. నాడు నేడు కార్యక్రమంలో భాగంగా 100 కోట్ల రూపాయలతో నెల్లూరు వైద్య కళాశాలలో అత్యాధునిక సౌకర్యాలు కల్పించామన్నారు. జిల్లాలో కరోనా థర్డ్‌వేవ్‌ను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు. వ్యాక్సినేషన్ ప్రక్రియను విజయవంతంగా పూర్తిచేశామని, మూడు కోవిడ్ ల్యాబ్‌లను ఏర్పాటు చేసి విరివిగా కరోనా పరీక్షలు చేసి రోగులకు మెరుగైన చికిత్స అందేలా చర్యలు చేపట్టామని తెలిపారు. సర్వేపల్లి శాసనసభ్యులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ సర్వేపల్లి నియోజకవర్గం లోని పొదలకూరు, కసుమూరు, మనుబోలు, ముత్తుకూరు ఆరోగ్య కేంద్రాలకు సిఫ్ట్రో రిలీఫ్ కంపెనీవారు రూ.78 లక్షల విలువైన అత్యాధునిక వైద్యపరికరాలను అందజేసేలా కృషిచేసిన వసంత లక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకురాలు వసంతలక్ష్మిని అభినందించారు. ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తి, జాయింట్ కలెక్టర్(అభివృద్ధి) గణేష్‌కుమార్, డిఎంహెచ్‌ఓ రాజ్యలక్ష్మి, డిసిహెచ్‌ఎస్ ఉమ, ఎంపీడీఓ సరళ, తాసిల్దార్ ప్రసాదరావు, సిహెచ్‌సి వైద్యాధికారి రామలక్ష్మి, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.





## కోవిడ్ బాధితుల ప్రాణాలు నిలపడం కోసం...

# శ్రీసిటీలో 130 కోట్లతో.. ఆక్సిజన్ ప్లాంట్

- రోజుకు 220 టన్నుల ప్రాణవాయువు ఉత్పత్తి
- వర్చువల్‌గా ప్రారంభించిన ముఖ్యమంత్రి జగన్

*కోవిడ్ తీవ్రమైన రోజుల్లో ఎంతో మంది బాధితులు ఆక్సిజన్ అందుబాటులో లేక విలవిలలాడిపోయారు. ఇప్పుడు కూడా కోవిడ్ ఉధృతమవుతున్న పరిస్థితుల్లో ఆ వ్యాధితో బాధపడుతున్నవారికి ఆక్సిజన్ (ప్రాణవాయువు) కొరత లేకుండా చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో తీసుకుంటున్న చర్యలు ఇప్పుడు ఒక కొలిక్కి వస్తున్నాయి. ఈ నేపథ్యంలో శ్రీసిటీలో ఇటీవల 130 కోట్ల రూపాయల వ్యయంతో రోజుకు 220 టన్నుల ఆక్సిజన్ ఉత్పత్తి చేసే ప్లాంట్ కూడా ప్రారంభం కావడం శుభపరిణామం.*

అంతర్జాతీయస్థాయిలో ప్రముఖ పారిశ్రామికవాడగా ప్రఖ్యాతిగాంచిన శ్రీసిటీలో తాజాగా నోవా ఎయిర్ టెక్నాలజీస్ ప్రై.లి. వారు రోజుకు 220 టన్నుల ఆక్సిజన్‌ను ఉత్పత్తిచేసేందుకు అనువైన ఆక్సిజన్ ప్లాంట్‌ను నెలకొల్పారు. దీనిని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇటీవల తాడేపల్లిలోని తన కార్యాలయం నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. కోవిడ్ బాధితులకు మెడికల్ ఆక్సిజన్ ప్రాణవాయువు వంటిదని, అందువల్ల కొరత లేకుండా ఆక్సిజన్‌ను అందుబాటులో ఉంచాలనే ధ్యేయంతో నోవా ఎయిర్‌తో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుందని, కర్మాగార నిర్మాణం ప్రారంభించిన అనంతరం అత్యంత వేగంగా.. అంటే కేవలం 14నెలల్లోనే దీనిని ప్రారంభించడం సంతోషంగా ఉందని సిఎం అన్నారు. 130 కోట్ల రూపాయల పెట్టుబడితో 150 మందికి ఉపాధి కల్పించే లక్ష్యంతో ప్రారంభమైన ఈ ప్లాంట్‌లో పెద్ద ఎత్తున ఆక్సిజన్ తయారవుతుందని, దాంతో పాటు ద్రవ రూప ఆక్సిజన్, నైట్రోజన్, ఆర్గాన్ వాయువులు కూడా ఉత్పత్తి అవుతాయని చెప్పారు. రాష్ట్రంలో ఇప్పటిదాకా 300 టన్నుల ఆక్సిజన్ తయారీలో ఉందని, శ్రీసిటీలో అందుకు అదనంగా 220 టన్నుల ఉత్పత్తి సామర్థ్యం లక్ష్యంగా నోవా ఎయిర్ పని చేస్తుందని తెలిపారు. ఇప్పటికే రాష్ట్రంలోని వివిధ ఆసుపత్రుల్లో ఆక్సిజన్‌కు లోటు లేకుండా 144పిఎస్ఎ ప్లాంట్‌లు ఏర్పాటు చేశామని, మరో 32 ప్లాంట్‌ల ఏర్పాటుకు కృషి జరుగుతోందని, 24వేల ఆక్సిజన్ బెడ్‌లు అందుబాటులోకి తెచ్చామని సిఎం వివరించారు. శ్రీసిటీ ఎం.డి రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ ఏపి ఇండస్ట్రియల్ గ్యాస్, మెడికల్ ఆక్సిజన్ తయారీ నూతన పారిశ్రామిక విధానానికి స్పందించిన తొలి అతిపెద్ద పారిశ్రామిక గ్యాస్ పరిశ్రమ నోవా ఎయిర్ అని, శ్రీసిటీలో దీనిని ప్రారంభించడం విశేషమని అన్నారు. నాడు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు శ్రీసిటీలో ఆక్సిజన్ ట్యాంకుల తయారీ పరిశ్రమ విఆర్‌విని ప్రారంభించగా, ఇప్పుడు ఆయన తనయుడు ఆక్సిజన్ ప్లాంట్‌ను ప్రారంభించడం శ్రీసిటీ ప్రగతిలో ఒక ముఖ్యఘట్టమని అన్నారు.

### నా ఆప్తమిత్రుడు రవి - సిఎం జగన్

ఈ ప్లాంట్ ప్రారంభోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి జగన్ తన సందేశాన్ని ఇస్తూ శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డిని 'నా ఆప్తమిత్రుడు రవి' అంటూ సంబోధించారు. ప్లాంట్ యాజమాన్యాన్ని, నిర్వాహకులను ఆయన పేరుపేరునా అభినందించారు. నోవా ఎయిర్ ఎం.డి గజానన్ తదితరులు పాల్గొన్నారు.

# నాడు-నేడుతో పాఠశాలల అభివృద్ధి

**- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్న**



విద్యార్థినిలతో పాటు తరగతి గదిలో బెంచ్‌పై కూర్చున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రప్రభుత్వం నాడు-నేడు పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఎన్నో పాఠశాలలను అభివృద్ధి చేస్తోందని, విద్యాభివృద్ధికి తమ ప్రభుత్వం నిరంతర కృషిచేస్తోందని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి చెప్పారు. ఇటీవల ఆయన కోవూరు నియోజకవర్గంలోని విడవలూరులో ఉన్న పిఆర్‌ఆర్ అండ్ విఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలను సందర్శించి విద్యార్థులు, అధ్యాపకులతో మాట్లాడారు. అమ్మఒడి, జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన, జగనన్న గోరుముద్ద తదితర పథకాలతో ప్రభుత్వం విద్యావ్యవస్థ అభివృద్ధికి చేస్తున్న కృషిని ఆయన వివరించారు. ఆ కళాశాలలో ఫ్యాన్ల ఏర్పాటుకు, ఫర్నిచర్‌కు రెండున్నర లక్షల రూపాయల విరాళాన్ని అందజేస్తామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే అధ్యాపకులకు తెలియజేశారు. ఆటస్థలం బాగుచేసేందుకు 16 లక్షలతో ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకరరెడ్డితో చర్చించి వారిచ్చే నిధులతో రెండు కళాశాలల్లో వాటర్ ప్లాంట్‌లు ఏర్పాటుచేస్తామన్నారు. డిగ్రీ కళాశాల భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో కొత్త భవనం నిర్మించే విషయమై ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్తామన్నారు. కళాశాలలకు వచ్చే దారిలో ఉన్న కల్వర్టును బాగుచేసేందుకు కూడా 20 లక్షలతో ప్రతిపాదనలున్నాయని చెప్పారు. జూనియర్ కళాశాలలో సైకిల్‌స్టాండ్ ఏర్పాటుకు పూర్వ విద్యార్థులు బెజవాడ గోవర్ధన్‌రెడ్డి, పూండ్ల అచ్యుత్‌రెడ్డి, కాటంరెడ్డి నవీన్‌కుమార్ రెడ్డి లక్ష రూపాయలు ఇవ్వనున్నారని తెలిపారు. డిసిఎమ్మెస్ ఛైర్మెన్ చలపతిరావు, ఎంపిపి భవానమ్మ, సర్పంచ్ ప్రవీణ్, వైకాపా నాయకులు ప్రవీణ్‌రెడ్డి, శ్రీహరిరెడ్డి, ప్రసాద్, మల్లికార్జున్, ప్రిన్సిపాల్స్ సుజాత, సురేష్, ఎంపిడిఓ చిరంజీవి, తహశీల్దార్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.




### విశ్వభారతిలో తరగతి గది ఏర్పాటుకు..

## ఆదాల సతీమణి వింధ్యావళమ్మ హామీ

**- విజయ డెయిరీ ఛైర్మన్ రంగారెడ్డి**



నెల్లూరులోని విశ్వభారతి అంధుల పాఠశాలలో తరగతి గది నిర్మాణానికి నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి సతీమణి వింధ్యావళమ్మ హామీ ఇచ్చారని విజయ డెయిరీ ఛైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి తెలిపారు. వింధ్యావళమ్మ పుట్టినరోజు సందర్భంగా ఆమె మాట ఇచ్చారని, ఆమె ఆయురారోగ్యాలతో సుఖంగా ఉండాలని అందరం కోరుకుంటున్నామని అన్నారు. వింధ్యావళమ్మ పుట్టినరోజు సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు మిఠాయిలు పంచారు. ఆదాల దంపతులు ఎంతో దయతో విశ్వభారతికి ఎన్నో సదుపాయాలు కల్పించారని స్కూల్ కరెస్పాండెంట్ ప్రభావతి ఈ సందర్భంగా వారికి కృతజ్ఞతలు తెలిపారు. మాజీ కార్పొరేటర్ స్వర్ణా వెంకయ్య, నరసింహారావు, ఇక్బాల్, మైపాడు అల్లాభక్ష్, పుట్టా విజయకుమార్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డిలతో పాటు పాఠశాల హెడ్మాస్టర్ రమణారెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## రంగనాథస్వామికి..బంగారు గరుడసేవ



తై అమావాస్య సందర్భంగా నెల్లూరు రంగనాయకులపేటలోని శ్రీ తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో స్వామివార్లకు విశేష పూజలు చేశారు. శ్రీ రంగనాథ స్వామివారికి బంగారు గరుడసేవ ఉత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు కిడాంబి జగన్నాథాచార్యులు, నిశింద సుదర్శనాచార్యులు ఆధ్వర్యంలో ఈ వేడుక జరిగింది. ఆలయ ఛైర్మన్ శివకుమార్‌ఆచారి, ఇ.ఓ డి.వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు.

## 'శుభమస్తు'లో.. మెగా రక్తదాన శిబిరం



నెల్లూరు విఆర్‌సి సెంటర్‌లో ఉన్న శుభమస్తు షాపింగ్‌మాల్‌లో ఇటీవల మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. షాపింగ్‌మాల్ అధినేత దివంగత బయ్యా వెంకటరమణయ్య 7వ వర్ధంతిని పురస్కరించుకుని ఈ కార్యక్రమం చేపట్టారు. శుభమస్తు ఫౌండేషన్, లయన్స్‌క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో పలువురు షాపింగ్‌మాల్ సిబ్బంది రక్తదానం చేశారు. దీంతోపాటు స్థానిక చిన్నబజారులో ఉన్న న్యూ రాజ్యలక్ష్మి హాల్‌లో వెయ్యి మందికి వస్త్రదానం, అన్నదానం నిర్వహించారు. రెడ్‌క్రాస్ జిల్లా కమిటీ ఛైర్మన్ పి.చంద్రశేఖర్‌రెడ్డి, సభ్యుడు బయ్యా ప్రసాద్, లయన్స్‌క్లబ్ ఆఫ్ పినాకిని నెల్లూరు ప్రెసిడెంట్ జేవి మురళీమోహన్‌రావు, సెక్రటరీ అయితా భాస్కర్, కోశాధికారి ఎం.కోటేశ్వరరావు, సత్యం, నల్లూరి కిరణ్, నల్లూరి సౌజన్య, కె.జయశ్రీ, జి.భావన; పి.ప్రేమ తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతి కార్యదర్శులకు ఉద్యోగోన్నతి

జిల్లాలో గ్రేడ్-4 పంచాయతి కార్యదర్శులుగా పనిచేస్తున్న పలువురికి గ్రేడ్-3 కార్యదర్శులుగా ఉద్యోగోన్నతి కలగడంతో పంచాయతి కార్యదర్శుల్లో సంతోషం వ్యక్తమవుతోంది. ఇటీవల జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు 54 మంది పంచాయతి కార్యదర్శులకు ఉద్యోగోన్నతి కల్పించారు. 2018 ఏప్రిల్ 1 నుంచి 2021 డిసెంబరు 21 వరకు పంచాయతీల్లో ఏర్పడిన గ్రేడ్-3 పంచాయతి కార్యదర్శుల పోస్టుల ఖాళీలకు సంబంధించి రిజర్వేషన్ ప్రకారం 7:3 నిష్పత్తిలో ఉద్యోగోన్నతి కల్పించారు. ఈ సందర్భంగా పంచాయతి కార్యదర్శుల సంఘం వారు జిల్లా కలెక్టర్‌కు, డిపిఓకు తమ కృతజ్ఞతలు తెలిపారు.

# నెల్లూరు కబుర్లు




## స్ఫూర్తిప్రదాత.. మహాత్మాగాంధీ

**- విఎస్‌యు ఉపకులపతి జిఎం సుందరవల్లి**

మహాత్మాగాంధీజీ దేశానికి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను ప్రసాదించిన మహనీయుడని, ఆయన ఆశయాలు ప్రతి విద్యార్థికి స్ఫూర్తిదాయకమని విక్రమసింహపురి విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జిఎం సుందరవల్లి అన్నారు. గతనెల 30న గాంధీజీ వర్ధంతి సందర్భంగా విఎస్‌యులో గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఆమె నివాళులర్పించారు. అహింస, సత్యాగ్రహాలే ఆయుధాలుగా ఆయన బ్రిటిష్‌వారితో పోరాటం సాగించి దేశానికి స్వాతంత్ర్యాన్ని సాధించారన్నారు. విద్యార్థులు అంకితభావంతో గాంధీజీ అడుగుజాడల్లో నడవాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విఎస్‌యు రిజిస్ట్రార్ డా.ఎల్.విజయకృష్ణారెడ్డి, డిప్యూటీ రిజిస్ట్రార్ డా.సాయిప్రసాద్‌రెడ్డి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ డా.సుజయ్ కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### భక్తజనసందోహంతో నిండిపోయిన..

## వైద్యవీరరాఘవస్వామి దేవస్థానం

**- భక్తిశ్రద్ధలతో.. తై అమావాస్య వేడుక**



వేమాలశెట్టి బావి వద్ద పూజలు చేస్తున్న మహిళలు

తై అమావాస్యను పురస్కరించుకుని ఈనెల 1న నెల్లూరు దర్గామిట్టలోని శ్రీ వైద్య వీరరాఘవ స్వామి దేవస్థానానికి భక్తజనం పోటెత్తారు. వేలాది మంది భక్తులు తరలివచ్చి స్వామివారికి పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో వెలసి ఉన్న చరిత్రాత్మకమైన వేమాలశెట్టి బావిలో బెల్లం వేసి, పూలు, ధూప దీపాలతో స్వామివారికి పూజలు చేశారు. ఆలయ బలిపీఠం వద్ద ఉప్పు మిరియాలు సమర్పించుకున్నారు. వందలాది సంవత్సరాలుగా దేవస్థానంలో భక్తులు ఈ పద్ధతిని ఒక ఆచారంగా కొనసాగిస్తున్నారు. అలా చేస్తే భక్తుల ఆరోగ్యానికి కొదవుండదని, శ్రీ వైద్య వీరరాఘవస్వామి కరుణతో ఎలాంటి దీర్ఘకాలిక వ్యాధులైనా సమసిపోతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. నుడా ఛైర్మన్ ముక్కాల ద్వారకానాథ్, కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాసయాదవ్, అనేకమంది నాయకులు, ప్రముఖులు, పెద్ద సంఖ్యలో మహిళలు ఆలయానికి వచ్చి స్వామివార్లను దర్శించుకున్నారు.

## రాంబాబుకు.. బిజెపి నాయకుల అభినందన

తన విశిష్టమైన సేవలతో ఇటీవల ఇండియన్ పోలీస్ మెడల్‌కు ఎంపికైన సిఐడి డిఎస్పీ రాంబాబును ఇటీవల పలువురు బిజెపి నాయకులు అభినందించారు. నెల్లూరులోని సిఐడి కార్యాలయంలో బిజెపి నాయకులు మిడతల రమేష్, బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసయాదవ్, వీవర్స్ యునైటెడ్ ఫ్రంట్ జిల్లా అధ్యక్షుడు బాలాజీ, బీసీ నాయకులు నాగేంద్ర, మల్లికార్జున్, రామకృష్ణ తదితరులు పాల్గొని ఆయన్ను శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

## జేపీరెడ్డి సేవలు అపూర్వం

ప్రముఖ చర్మవ్యాధుల నిపుణునిగా నెల్లూరులో ఎంతో ప్రసిద్ధిచెందిన డాక్టర్ జేపీరెడ్డి సేవలు అపూర్వమని, ఆయన లేని లోటు తీరనిదని పలువురు వైద్యులు పేర్కొన్నారు. ఇటీవల బెంగుళూరులో డాక్టర్ జేపీరెడ్డి మృతిచెందడంతో ఆయన్ను స్మరించుకుంటూ నెల్లూరులోని ఐఎంఏ డాక్టర్లు ఒక ప్రకటనలో వారి కుటుంబానికి తమ సంతాపం తెలిపారు. జేపీరెడ్డి వృత్తిరీత్యా వైద్యులైనప్పటికీ, రచనారంగంలో సుప్రసిద్ధులని, ఆయన రాసిన అనేక కవితలు, ఇతరత్రా రచనలు అందరినీ బాగా ఆకట్టుకునేవని వారు గుర్తు చేసుకున్నారు.

## విదేహ్‌ఖరే స్థానంలో.. కొత్త జేసీ జాహ్నవి





నెల్లూరు జిల్లా జాయింట్ కలెక్టర్ (హౌసింగ్) విదేహ్‌ఖరే స్థానంలో కొత్త జేసీని నియమిస్తూ ప్రభుత్వం గతనెల 30న ఉత్తర్వులిచ్చింది. విదేహ్‌ఖరేను రాష్ట్ర ఆర్థికశాఖ డిప్యూటీ సెక్రటరీగా బదిలీ చేసి, ఆయన స్థానంలో చిత్తూరుజిల్లా మదనపల్లె సబ్ కలెక్టర్‌గా పనిచేస్తున్న 2018 బ్యాచ్ ఐఏఎస్ అధికారిణి మేడిద జాహ్నవిని నెల్లూరుజిల్లా జేసీగా నియమిస్తూ ఆదేశాలు జారీచేసింది.

## రిజిస్ట్రేషన్ ఇన్‌చార్జి డిఐజీగా విజయలక్ష్మి

జిల్లా రిజిస్ట్రేషన్ శాఖ ఇన్‌చార్జి డైరెక్టర్ జనరల్‌గా ఒంగోలు డిఐజిగా ఉన్న విజయలక్ష్మిని నియమిస్తూ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులిచ్చింది. దీంతో నెల్లూరులోని డిఐజి కార్యాలయంలో ఆమె గతనెల 31న బాధ్యతలు చేపట్టారు. నెల్లూరులో ఇప్పటిదాకా ఆ స్థానంలో పనిచేస్తున్న అబ్రహాం విజయవాడలోని ఐజి కార్యాలయానికి డిప్యుటేషన్‌పై పంపారు.

### ఆర్య క్షత్రియ సంఘం..

## క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న 'నుడా' ఛైర్మన్ ముక్కాల ద్వారకానాథ్

నెల్లూరు జిల్లా ఆర్యక్షత్రియ సంఘం వారు ఇటీవల 2022 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. నుడా ఛైర్మన్ ముక్కాల ద్వారకానాథ్ నివాసంలో ఈ కార్యక్రమం జరిగింది. ఆ సంఘం ముఖ్య సలహాదారులు నందిగం చంద్రశేఖర్ (చందు వర్మ), నెల్లూరుజిల్లా అధ్యక్షులు యకమా శ్రీనివాసవర్మ, ఉపాధ్యక్షులు గుండా శ్రీనివాసులు (వాసు) సెక్రటరీ దామ వెంకటేశ్వర్లు, జాయింట్ సెక్రెటరీ టేకుమళ్ళ ఉమాశ్యామ్‌ప్రసాద్, సంఘం సభ్యులు నందిగం సాయిరామ్,మనోహర్, వెల్లాల శ్రీనివాసులు పాల్గొన్నారు.

## పురంధరదాసు ఆరాధనోత్సవం



నెల్లూరు రంగనాయకులపేటలో ఉన్న ఉత్తరాది మఠంలో ఈ నెల 1న వాగ్గేయకారుడు పురంధరదాసు 558వ ఆరాధన మహోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సంగీతకళాకారులు సంకీర్తనలు ఆలపించారు. భిక్షాటనాపూర్వక శ్రీ త్యాగరాజ స్మరణోత్సవ సభ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మఠం మేనేజర్ భీమసేనాచార్యులు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## బ్రాహ్మణసంఘాల అభ్యున్నతికి కృషిచేస్తా

**- కొత్త అధ్యక్షుడు వాసుదేవరావు**



జిల్లాలో బ్రాహ్మణ సంఘాల అభ్యున్నతికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని జిల్లా బ్రాహ్మణ సేవాసంఘాల సమితి అధ్యక్షుడు జి.వాసుదేవరావు చెప్పారు. గతనెల 30న నెల్లూరు రంగనాయకులపేటలోని ఆర్యవైశ్య బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ కళ్యాణమండపంలో జరిగిన బ్రాహ్మణ సంఘాల సమావేశంలో వాసుదేవరావు ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ తనను ఏకగ్రీవంగా ఎన్నుకునేందుకు సహకరించినవారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. బ్రాహ్మణ సత్రాలన్నింటినీ బ్రాహ్మణులకు చెందేవిధంగా చూడాలని ప్రభుత్వానికి విన్నవిస్తానని ఆయన చెప్పారు. అనంతరం ఆయన్ను జిల్లా సంఘం కార్యవర్గ సభ్యులు ఘనంగా సన్మానించారు. బ్రాహ్మణ సంఘం నాయకులు ఇప్పపల్లి కామేశ్వర ప్రసాద్, కొత్రా సురేష్‌కుమార్, కెవిఎల్ నారాయణరావు, ఎల్‌వి కృష్ణకుమార్, శివయ్యస్వామి తదితరులు పాల్గొన్నారు.

## మోకాళ్ల మార్పిడి శస్త్ర చికిత్సల్లో..

# రోబోటిక్ ఆపరేషన్లు

## ➤ శ్రీకారం చుట్టిన అపోలో హాస్పిటల్స్




వివరాలను తెలియజేస్తున్న డాక్టర్ మదన్‌మోహన్‌రెడ్డి, శ్రీరామ్‌సతీష్ తదితర వైద్యులు

**మోకాళ్ళ మార్పిడి శస్త్ర చికిత్సల్లో నెల్లూరులోని అపోలో హాస్పిటల్ నవశకం ఆవిష్కరించింది. రోబోటిక్ ఆపరేషన్లను విజయవంతంగా అందుబాటులోకి తీసుకు వచ్చింది. ఇటీవల స్థానిక అపోలో ఆసుపత్రిలో విలేకర్ల సమావేశం ఏర్పాటుచేసి సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్, రోబోటిక్ నీ-రిప్లేస్‌మెంట్ సర్జన్ డాక్టర్ మదన్ మోహన్‌రెడ్డి, ఆసుపత్రి మెడికల్ సూపరిం టెండెంట్ డాక్టర్ శ్రీరామ్‌సతీష్‌లు ఆ వివరాలను తెలియజేశారు.**

మోకాళ్ళ మార్పిడికి సంబంధించిన శస్త్రచికిత్సల్లో సాధారణంగా అనేక ఇబ్బం దులు వస్తుంటాయి. ఆపరేషన్ జరిగిన కొన్ని సంవత్సరాలకే రోగులు మళ్ళీ మోకాళ్ళ సమస్యలతో కష్టాలు పడుతుం టారు. ఈ సమస్యను అధిగమించడానికి అత్యంత తక్కువ సమయంలో రోగులు ఆరోగ్యంతో కోలుకునేవిధంగా, దీర్ఘకాలిక నొప్పి నివారణ కోసం రోబోటిక్ ఆప రేషన్‌లు అందుబాటులోకి తీసుకువచ్చి అపోలో ఆసుపత్రి నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టింది. ఈ ఆపరేషన్ల ద్వారా తక్కువ సమయంలోనే రోగులు రికవరీ అవుతారని, దీర్ఘకాలిక నొప్పి నివారణ అవుతుందని డాక్టర్ మదన్‌మోహన్‌రెడ్డి చెప్పారు. మోకాలి నొప్పితో తీవ్రంగా బాధపడేవారికి రోబోటిక్ అసిస్టెడ్ మోకాలి మార్పిడి చేయవచ్చన్నారు. సాధారణంగా మోకాళ్ళ నొప్పులతో ఇబ్బందులు పడు తున్నవారికి ఆపరేషన్ అవసరం లేకుండా తొలుత బరువు తగ్గడం, వ్యాయమాలతో సహా జీవనశైలిలో మార్పులు, ఇంట్రా కీలు షాట్లు, ఫిజియోథెరపీ, మోకాలి జాయింట్లు కలపడం వంటి సంప్రదాయ చికిత్సలు సూచిస్తామని, వాటి ద్వారా ఉపశమనం కలగనప్పుడే ఆపరేషన్లకు సిఫార్సు చేస్తామని చెప్పారు. అయితే అందులో రోబోటిక్ సర్జరీ ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుందన్నారు.

### రోబోలతో చేసే చికిత్స కాదు :

రోబోటిక్ సర్జరీ అంటే రోబోలతో చికిత్స చేస్తారేమోనని ప్రజలు అపోహపడు తుంటారని, అయితే అది పూర్తిగా అవాస్త వమని డాక్టర్ మదన్‌మోహన్‌రెడ్డి తెలి పారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయో గించి, సీటీ స్కాన్ ద్వారా రోగి మోకాలి 3-డి నమూనాను రూపొందించి తద్వారా ఖచ్చితత్వంతో చేసే శస్త్రచికిత్స అని. దీని వల్ల మోకాళ్ళ చుట్టుపక్కల ఉన్న మృదుత్వం దెబ్బతినకుండా కణజాలానికి ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉంటుందన్నారు. ఈ రోబోటిక్ ఆపరేషన్ ద్వారా ఒక చిన్న కోత మాత్రం ఉంటుందని, రోగి వేగవంతంగా కోలుకుంటారని తెలిపారు. రోగులు ఆప రేషన్ చేయించుకున్నరోజునే డిశ్చార్జి అవు తారని, అపోలో ఆసుపత్రిలో ఈ ఆపరే షన్లు ఇప్పుడు అందుబాటులోకి వచ్చాయని చెప్పారు. మోకాళ్ల నొప్పులతో బాధపడుతూ, కీళ్ళ మార్పిడి చేయించుకోవాలనుకునేవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకో వాలని సూచించారు. ఈ సమావేశంలో అపోలో ఆసుపత్రి ఆర్థోపెడిక్ సర్జన్లు డాక్టర్ పమ్మి కార్తీక్‌రెడ్డి, డాక్టర్ వివేకానందరెడ్డి, డాక్టర్ శశిధర్‌రెడ్డి, అనస్థీషియా స్పెయిన్ స్పెషలిస్ట్ డాక్టర్ శ్రీనివాసన్ పాల్గొన్నారు.

# ప్రొటోకాల్‌ను తప్పనిసరిగా పాటించాలి

## శాసనసభ ప్రివిలేజ్ కమిటీ ఛైర్మెన్ కాకాణి



ప్రజాప్రతినిధుల హక్కులకు భంగం కలగకుండా ప్రొటోకాల్‌ను పటిష్టవంతంగా అమలుచేయాలని, సభ్యుల హక్కులకు భంగం కలిగితే సహించేది లేదని శాసనసభ ప్రివిలేజ్‌కమిటీ ఛైర్మెన్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి జిల్లా అధికారులకు స్పష్టం చేశారు. గతనెల 28న నెల్లూరు జడ్పీ కార్యాలయంలో జిల్లా అధికారులతో ఆయన సమావేశమయ్యారు. రాష్ట్రంలోని 175 మంది శాసనసభ్యుల హక్కులకు భంగం కలగకుండా చూడాల్సిన బాధ్యత తమ కమిటీపై ఉందని ఆయన అంటూ ప్రొటోకాల్ అమలులో అధికారులు ఎలాంటి నిర్లక్ష్యం వహించకుండా తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించిన శిలాఫలకాలు, బోర్డులు, ఆహ్వానపత్రికలు, వేదికలపైకి ప్రజాప్రతినిధులను ఆహ్వానించడం వంటి అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టిసారించి ప్రజాప్రతినిధులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ఇలాంటి విషయాల్లో ఏ శాసనసభ్యుడు తమ కమిటీకి ఫిర్యాదుచేసినా వెంటనే విచా రించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. కమిటీ సభ్యులు విజయవాడ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, బొబ్బిలి ఎమ్మెల్యే అప్పలనాయుడు, గూడూరు ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డితో పాటు అసెంబ్లీ కార్యదర్శి విశ్వనాథ్, కలెక్టర్ చక్రధర్‌బాబు, జేసీలు హరేందిరప్రసాద్, గణేష్‌కుమార్, విదేహ్‌ఖరే, రోజ్‌మాండ్, నగరపాలక సంస్థ కమిషనర్ దినేష్‌కుమార్, జడ్పీ సిఇఓ శ్రీనివాసరావు, డిపిఓ ధనలక్ష్మి, డ్వామా పీడీ సాంబశివారెడ్డి తదితరులు పాల్గొన్నారు. తొలుత ప్రివిలేజ్‌కమిటీ బృందం గొలగమూడిలోని భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి మందిరాన్ని, కృష్ణపట్నం పోర్టును సందర్శించారు.









6వ వర్ధంతి

నిష్కల్మష హృదయుడు, నిస్వార్థ సేవాతత్పరుడు,
నిరంతర ప్రజాసేవకుడు

చిట్టమూరు పద్మనాభరెడ్డి గారు

(మాజీ వైస్ ఛైర్మెన్, జిల్లా ప్రజాపరిషత్, నెల్లూరుజిల్లా)

పరమపదించి తేది. 9.2.2022 నాటికి ఆరేళ్ళు గడుస్తాయి.

వారి దివ్యస్మృతికి అంజలి ఘటిస్తూ...

బావమరిది / అల్లుడు - కుమార్తె
ప్రొ॥ సి.యం.కె.రెడ్డి - శ్రీమతి నిర్మల, చెన్నై

కోడలు
డా॥ సి.భారతి, యు.యస్.ఏ
(W/o. లేట్. డా॥ సి.మధుసూదన్‌రెడ్డి)

మనుమరాలు, మనుమడు
ప్రణీత అరవింద్, లోహిత్, యు.యస్.ఏ

మనుమడు - మనుమరాలు
డా॥ సి.యం.కిషోర్ - శ్రీమతి లీలాదేవి, చెన్నై

మనుమరాలు - మనుమడు
శ్రీమతి హారిత - డా॥ రామానందరెడ్డి, కాకినాడ

మునిమనుమలు మునిమనుమరాండ్రు
జయేష్ & అస్మిత    కీర్తన లక్ష్మి & తనవ్

# ఏటా బడ్జెట్ కామెడీ

ప్రజాస్వామికమైన భారతదేశంలో కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏటా ఫిబ్రవరి 1వ తేదీన 'వార్షిక బడ్జెట్'ను పార్లమెంట్‌లో ప్రవేశపెడుతూ ఉంటుంది. ఇదే దుబాయ్, సౌదీ అరేబియా, థాయిలాండ్, జోర్డాన్ వంటి రాచరిక దేశాల్లోగానీ, చైనా వంటి నియంతృత్వ దేశాల్లో గానీ అయితే ఈ లంపటం ఉండదు. మనది ప్రజాస్వామ్య (ఉత్తుత్తిదే అయినా) దేశం కావడంతో దేశ ఆర్థికమంత్రికి ఈ 'న్యూసెన్స్' తప్పడం లేదు. ఈ జమా ఖర్చుల పద్దులను (దానినే బడ్జెట్ అని పిలుస్తుంటాం) లోక్‌సభలో ప్రవేశపెట్టడానికి ఓ వారం ముందునుంచే న్యూస్ ఛానళ్ల హడావుడి మొదలైపోతుంది. ఆర్థికమంత్రి లోక్‌సభలో ప్రవేశపెట్టబోయే వార్షిక బడ్జెట్‌పై రంగు రంగుల అంచనాలు, ఊహాగానాలు... సలహాలు... నిట్టూర్పులు... విశ్లేషణలతో ఛానల్స్ హోరెత్తిపోతాయి.

బడ్జెట్ ప్రవేశపెట్టాల్సిన ఆ ఫిబ్రవరి ఒకటి రానే వస్తుంది. ఆర్థికమంత్రి ఒక చిన్న ఎర్రని సూట్‌కేస్ పట్టుకుని పార్లమెంట్‌కు చిరునవ్వులతో వస్తారు. మీడియా వాళ్ళు నూటొక్క కెమెరాలతో చుట్టుముట్టేసి... ఒకరిపై ఒకరు పడి తొక్కేసుకుంటారు.

ఇప్పుడు సూట్‌కేస్‌కు బదులు ఓ మినీ లాప్‌టాప్‌తో ఆర్థికమంత్రి లోక్‌సభకు బయలుదేరుతారు. సూటు, బూటు, మెళ్ళో టై కట్టుకుని ఓ పదిమంది ఆర్థిక మంత్రికి అటూ, ఇటూ నిలబడి చిరునవ్వులు చిందిస్తూ ఉంటారు. అంటే, ఈ చిట్టాను ఇంతమంది మేధావులు కలిసి, తయారుచేశారు అనే సంకేతాలను మనకు ఇవ్వడానికి అన్న మాట. 'రాజు వెడలే... రవితేజములలరగా...' అన్నట్టుగా ఆర్థిక మంత్రి లోకసభలో చిరునవ్వులతో అడుగుపెడతారు.




సైలెన్స్...!

ప్రధానమంత్రి, మంత్రులు, సభ్యులు అందరూ చెవులు రిక్కిస్తారు. సమయం ఉదయం 11 గంటలు అవుతుంది. ఆర్థికమంత్రి పైకిలేచి తన హాస్యభరిత, భావోద్వేగ, గంభీర, స్ఫూర్తిదాయక, దిశానిర్దేశ వార్షిక జమా ఖర్చుల పద్దులను చదువుతుంటే ప్రధాని మధ్య, మధ్యలో తన హర్షామోద సూచనగా సున్నితంగా, సుతారంగా ఎదురుగా ఉండే బల్లను చరుస్తూ ఉంటారు. అదిచూసి, మంత్రులు, అధికారపక్ష సభ్యులు హుషారవుతారు. 'బడ్జెట్ ప్రసంగం' పూర్తి అవుతుంది. వెనక్కి తిరిగి చూస్తే, మామూలు జనానికి పనికివచ్చే అంశాలు ఉండీ లేనట్టుగా ఉంటాయి.

నిజానికి ఇది ఓ పేకమేడ, పుల్లకు చుట్టుకుని, ఎర్రగా... నిగనిగ లాడుతూ, ఇంత లావున ఉంటుంది. గట్టిగా నొక్కితే గాలి పోయిన బెలూన్‌లాగా తుస్సుమని ముడుచుకుపోతుంది. జనం చెవిలో పూలు బాగానే పెట్టాం అనుకుంటూ అధికారపక్షం ఆనంద పరవశం చెందుతుంది.

కానీ, ఎక్కడి పేదలు అక్కడే ఉంటారు. ఎక్కడి అరకొర వసతులు అక్కడే ఉంటాయి. ఎక్కడ అడుక్కుతినేవారు అక్కడే అడుక్కుతింటుంటారు. ఎక్కడి గుడిసెలు అక్కడే ఉంటాయి. గత 75 సంవత్సరాలుగా ఏ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ ఇదే తంతు.

స్వతంత్ర భారతదేశంలో మొట్టమొదటి బడ్జెట్‌ను 1947 నవంబర్ 26న భారత తొలి ఆర్థికమంత్రి ఆర్.కే.షణ్ముఖంచెట్టి లోక్‌సభలో ప్రవేశపెట్టారు. మొత్తం వార్షిక బడ్జెట్ ఖర్చు కేవలం 197.39 కోట్లు. అప్పుడు ఈ దేశంలో దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న జనాభా సుమారు 23 కోట్లు. ఇప్పుడు మన బడ్జెట్ 40 లక్షల కోట్లకు పైబడి ఉంది. పేదల జనాభా దాదాపు 60 కోట్లకు పైబడి ఉంది అని అంటున్నారు. ఆ 60 కోట్ల జనాభా గురించి బడ్జెట్‌లో అక్షరం ముక్క ఉండదు. మరి ఏటా పెంచుకుంటూ పోతున్న బడ్జెట్ ఎవరికి భుజం కాస్తున్నది? లక్షలాది కోట్లు ఏమైపోతున్నాయి?

నిజానికి దేశంలో ప్రభుత్వం ఆదుకోవలసిన రంగాలు ప్రాథమికంగా అయిదు ఉన్నాయి. 1. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న పేదలు, 2. వేతన జీవులు, 3. వైద్య రంగం, 4. విద్యా రంగం. 5. రైతాంగ సమస్యలు. ఇక, ఏ రంగం అయినా ఈ ఐదింటి తరువాతే.. దేశంలోని సమస్త రంగాలనూ ఈ అయిదు రంగాలూ ప్రభావితం చేస్తుంటాయి. ఈ అయిదు రంగాలకూ ఉపశమనం లభిస్తే... మొత్తం సమస్త రంగాలకూ ఉపశమనం లభించినట్టే. వీటిని వీలైనంతగా పరిపుష్టం చేయాలనే వజ్ర సంకల్పం, చిత్తశుద్ధి, దేశంపై ప్రేమ అనేవి పాలకులకు ఉండాలి.

ఇప్పుడు మనపాలకులకు ఏ పార్టీ వారైనప్పటికీ ఈ లక్షణాలు ఉంటే స్వాతంత్రం వచ్చిన 75 సంవత్సరాల తరువాత కూడా మన సమాజంలో ఈ అయిదు రంగాలూ ఇప్పుడున్న దుస్థితిలో ఉండకూడదు కదా!

దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న వారి నుంచి ఏటా ఓ కోటి మంది ప్రజలను ఎంపిక చేసి, వారు ఎందుకు దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నారు? ఎంతకాలం నుంచి ఉన్నారు? ఎలా బతుకుతున్నారు? వారిని ఆ దారిద్ర్యరేఖపైకి తీసుకురావడానికి ప్రభుత్వం ఏమి చేయాలి? దానివల్ల ఎంతమంది, ఏ రకమైన లబ్ది పొందుతారు? అనే స్పృహ కేంద్ర ప్రభుత్వానికి ఉన్నట్టు అనిపించదు.

మన పార్టీ, మన రాష్ట్రం, రాష్ట్రాల్లో ఎన్నికలు, అక్కడ గెలవడానికి ఏం చెయ్యాలి, ఆ రాష్ట్రాల్లో ప్రజలను మభ్యపెట్టడం ఎలా, ప్రత్యర్థి పార్టీలు పాలించే రాష్ట్రాలను భ్రష్టు పట్టించడం ఎలా, మనకు కావలసిన పారిశ్రామిక వేత్తలను ఆదుకోవడానికి ఏమి చేయాలి, ఇందుకోసం ఏ ప్రభుత్వ శాఖల పీకలు నొక్కేయాలి... మొదలైన ఆలోచనలు బడ్జెట్ రూపకల్పనకు ప్రాతిపదికలు అయితే ఆ బడ్జెట్ వల్ల సాధారణ ప్రజలకు ఉపయోగం ఉండదు కదా! సాధారణ ప్రజల యోగక్షేమాలు మంచి చెడ్డలు పట్టని ప్రభుత్వాలు సమర్పించే 'వార్షిక బడ్జెట్'ను పార్లమెంట్‌లో కాకుండా, ఒక విలేకరుల సమావేశంలో చదివితే బాగుంటుంది. లేదా, టీవీలలోనూ చదివేయవచ్చు. కామెడీ రక్తి కడుతుంది.

కేంద్రంలోని మోదీ ప్రభుత్వాన్ని విమర్శించడానికి ఎప్పుడూ ఇష్టపడని వైసీపీ పార్లమెంటరీ నేత విజయసాయిరెడ్డి సైతం 'ఈ బడ్జెట్ చాలా నిరాశాజనకంగా ఉంది' అన్నారు.

తప్పనిసరి పరిస్థితుల్లో చేసిన అతిసున్నితమైన వ్యాఖ్య ఇది. దాదాపు పది కోట్లకు చేరువగా జనాభా ఉన్న రెండు తెలుగు రాష్ట్రాలకు కేంద్ర బడ్జెట్‌లో కేటాయించిన మొత్తం 974 కోట్ల రూపాయలు(ట). రమారమి నలభై లక్షలు ఉన్న బడ్జెట్‌లో ఈ 974 కోట్లు ఎంత శాతం అంటే - 0.0285714280.

దేశమంటే మట్టి కాదోయ్...
దేశమంటే పొలిటిక్సోయ్...
వట్టి మాటలు కట్టి పెట్టోయ్....

ప్రతిపక్షాల పీక నొక్కవోయ్... అన్నట్టుగా సాగే ఈ తంతు కోసం.. ఎదురుచూడడం, డిస్కషన్లు, 'నిపుణుల' విశ్లేషణలు, అంచనాలతో ఛానెళ్ళు చెలరేగిపోవడం చూస్తుంటే.. బడ్జెట్ ప్రెజెంటేషన్‌లో ఇంత వినోదం ఉందా అనిపిస్తోంది.

లాంగ్ లివ్ బడ్జెట్ ప్రెజెంటేషన్.

**- భోగాది వేంకట రాయుడు**
bhogadirayudu2152@gmail.com



జనవరి 26వ తేదీన నెల్లూరులో జరిగిన 73వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు, జిల్లా ఎస్పీ విజయరావు చేతులమీదుగా ఉత్తమసేవా పతకాలు అందుకుంటున్న గూడూరు టౌన్ సిఐ నాగేశ్వరమ్మ, నెల్లూరు 4వ పట్టణ సి.ఐ జి.దశరథరామారావు. కాగా, గూడూరు ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ పి.రామకృష్ణారావు డిసిహెచ్ఎస్ డాక్టర్ ఉమ చేతులమీదుగా ఉత్తమ సేవా పథకం అందుకున్నారు.

## ఎలక్ట్రికల్ రంగంలో..
# ఎన్నో ఉపాధి అవకాశాలు
### ఎన్‌బికెఆర్ విద్యార్థులకు అవగాహన



నేటి ఆధునిక కాలంలో ఎలక్ట్రికల్ రంగంలో అంతర్జాతీయస్థాయిలో ఎన్నో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని బెంగుళూరుకు చెందిన ఇంటెల్ కంపెనీ సీనియర్ ఇంజనీర్ మహబూబ్ ఖాన్ పఠాన్ అన్నారు. గతనెల 31న కోట మండలంలోని విద్యానగర్ ఐఎస్‌టిలో ఎలక్ట్రికల్ విభాగం ఆధ్వర్యంలో ' కెరీర్ గైడెన్స్ అండ్ ఆపర్చునిటీస్ ఫర్ ఎలక్ట్రికల్ ఇంజనీర్స్' అనే అంశంపై ఆయన ఉపన్యసించారు. ఈ సందర్భంగా ఆయన జాతీయ అంతర్జాతీయస్థాయిలో ఉన్న వివిధ ఉపాధి అవకాశాల గురించి విద్యార్థులకు తెలియజేశారు. అలాంటి అవకాశాలను సాధించేందుకు చేయాల్సిన కృషిని వివరించారు. ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ డా.వి.విజయకుమార్ రెడ్డి, విభాగాధిపతి డా.ఎస్ సురేష్‌రెడ్డి పాల్గొని వివిధ ఇంజనీరింగ్ విభాగాల ప్రాముఖ్యతపై విద్యార్థులకు అవగాహన కలిగించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు.

## గూడూరు డివిజన్ వార్తలు

# గూడూరును నెల్లూరు జిల్లాలోనే ఉంచండి
**- బిందురెడ్డి**



తహశీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు బిందురెడ్డి

ప్రభుత్వం ప్రకటించిన కొత్త జిల్లాల జీవోలో ఎస్‌పిఎస్ఆర్ నెల్లూరుజిల్లాలో ఉన్న గూడూరు రెవెన్యూ డివిజన్ ప్రాంతాన్ని తిరుపతి జిల్లాలో కలిపి శ్రీ బాలాజీ జిల్లాగా ప్రకటించడాన్ని గూడూరు జిల్లా ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని, ఆమేరకు గూడూరు ప్రజల తరఫున గూడూరు టౌన్ ఎమ్మార్వో బాలలీలారాణికి వినతి పత్రం అందజేశామని తిరుపతి పార్లమెంటు జిల్లా బిజెపి మహిళా మోర్చా అధ్యక్షురాలు, గూడూరు టౌన్ ఇన్‌ఛార్జ్ బిందురెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 'గూడూరును నెల్లూరు జిల్లాలోనే ఉంచండి, లేకపోతే గూడూరు చుట్టుపక్కల ఉన్న నియోజకవర్గాలతో కలిపి గూడూరును జిల్లాగా చేయండి' అంటూ ఎమ్మార్వోను కోరడం జరిగిందని ఆమె తెలిపారు. గూడూరు టౌన్ బీజేపీ అధ్యక్షుడు ఆరికట్ల బాలకృష్ణమనాయుడు, టౌన్ పూర్వపు ప్రధానకార్యదర్శి తాటిపర్తి రమేష్, ప్రస్తుత కార్యదర్శులు బి.కృష్ణయ్య, నరేంద్రకుమార్, శ్రీనివాసులురెడ్డి, భరత్‌కుమార్, నరసరాజు, చందన తదితర గూడూరు జిల్లా సాధన సమితి సభ్యులు పాల్గొన్నారు.

# లిటిల్ ఏంజెల్స్‌లో 'భద్రతా దినోత్సవాలు'




విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న మురళీమోహన్, శేషురెడ్డి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశాల మేరకు జనవరి 28వ తేదీన చిల్లకూరులోని 'లిటిల్ ఏంజెల్స్ పబ్లిక్ స్కూలు'లో 'భద్రతా దినోత్సవం' జరిగింది. ఈ కార్యక్రమంలో రవాణాశాఖ అధికారి మురళీమోహన్, మోటర్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ ఎం.వి.శేషురెడ్డిలు ముఖ్యఅతిథులుగా పాల్గొని విద్యార్థులకు, డ్రైవర్లకు భద్రతపైన పలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా రవాణాధికారి మురళీమోహన్ మాట్లాడుతూ 18 సంవత్సరాల లోపు పిల్లలు వాహనాలు నడిపితే 5000 రూపాయలు జరిమానాతో పాటు తల్లిదండ్రులను శిక్షార్హులుగా భావిస్తారని తెలిపారు. మోటర్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ శేషురెడ్డి విద్యార్థుల చేత భద్రతపైన ప్రతిజ్ఞ చేయించారు. పాఠశాల యాజమాన్యం శ్రీకాంత్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు సురేష్ కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గాంధీజీ ఆశయాలను నెరవేర్చాలి

**- కెవి చలమయ్య**



మహాత్మాగాంధీ కలలు గన్న విధంగా ఆయన ఆశయాలను నెర వేర్చాలని ఏపి ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యదర్శి, కెవి చలమయ్య అన్నారు. గతనెల 30న గాంధీజీ వర్ధంతి సందర్భంగా అంతర్జాతీయ వైశ్యసమాఖ్య ఆధ్వర్యంలో గాంధీజీ 75వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వ హించారు. అహింసే ఆయుధంగా భారతదేశానికి స్వాతంత్ర్యం సము పార్జించిన మహాత్మాగాంధీజీ నేటి యువతకు ఆదర్శమన్నారు. మద్య పానాన్ని నిషేధించాలని గాంధీజీ కోరుకునేవారని, వారి ఆశయాల సాధనకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కృషిచేయాలని ఆయన కోరారు. అంతర్జాతీయ వైశ్యసమాఖ్య అర్బన్ డెవలప్‌మెంట్ వైస్ ఛైర్మెన్ ఆర్‌వి శరత్, పబ్లిక్ రిలేషన్స్ కమిటీ వైస్‌ఛైర్మెన్ జెవికె బాబు, సర్వీస్ కమిటీ వైస్‌ఛైర్మెన్ ఎస్.నాగేశ్వరరావు, టూరిజం కమిటీ ఛైర్మెన్ నగరకంటి రవీంద్ర, సోమిశెట్టి వెంకటరత్నం, ఆర్‌వి శేషగిరి, వై.మహేష్‌తో పాటు పలువురు పట్టణ వైశ్యప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ ముఖ్య సలహాదారుగా..

# అనంతనాగేశ్వరన్

### హర్షం వ్యక్తం చేసిన శ్రీసిటీ ఎం.డి రవీంద్ర సన్నారెడ్డి

కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ ముఖ్య సలహాదారుగా ఐఎఫ్‌ఎంఆర్ గ్రాడ్యుయేట్ స్కూల్ ఆఫ్ బిజినెస్, మాజీ డీన్, క్రియా యూనివర్శిటీ ఎకనామిక్స్ విజిటింగ్ ప్రొఫె సర్ వి.అనంతనాగేశ్వరన్‌ను నియమిం చడం పట్ల శ్రీసిటీ పారిశ్రామికవర్గం హర్షం వ్యక్తం చేసింది. ఇది ఐఎఫ్‌ఎంఆర్, క్రియా యూనివర్శిటీకి, శ్రీసిటీకి గర్వకార ణమని శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఒక ప్రకటనలో సంతోషం వ్యక్తం చేశారు. దేశ అభివృద్ధికి ఆయన అపారమైన అనుభవం, పరిజ్ఞానం సహాయపడతాయంటూ ప్రొ.అనంత నాగే శ్వరన్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.

# విద్యార్థుల కోసం.. ప్లేట్లు, గ్లాసుల వితరణ



జిల్లా కలెక్టర్‌కు సామగ్రిని అందజేస్తున్న బంగే ఇండియా ప్రతినిధులు

బంగే ఇండియా ప్రై.లి కంపెనీ యాజమాన్యం ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థుల కోసం 2 లక్షల రూపాయల విలువచేసే భోజనం ప్లేట్లు, గ్లాసులను వితరణగా అందజేసింది. గతనెల 31న జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబుకు ఆ సామగ్రిని అందజేయగా, జిల్లాలోని 6 రెసిడెన్షియల్ పాఠశాలలకు వాటిని అందజేస్తామని అంటూ, బంగే సంస్థ వారు సామాజిక బాధ్యతతో ఇలా విద్యార్థులకు సాయం అందించడాన్ని కలెక్టర్ అభినం దించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు జేసీ హరేందిరప్రసాద్, ఏపి రెసిడెన్షియల్ స్కూల్స్ కన్వీనర్ కామేశ్వరి, బంగే ఇండియా మేనేజర్లు దక్షిణామూర్తి, దినేష్ పాల్గొన్నారు.

## బిల్లులు చేసేది లేదంటూ..

# ట్రెజరీ ఉద్యోగుల నిరసన



జిల్లా ట్రెజరీ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న ఉద్యోగులు

ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొత్త పిఆర్‌సి ప్రకారం జీతాలు బిల్లులు చేసేది లేదంటూ గతనె 31న నెల్లూరులోని ట్రెజరీ ఉద్యోగులు తమ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. జిల్లా పిఆర్‌సి సాధనసమితి నాయకులకు మద్దతునిస్తూ ట్రెజరీ ఉద్యోగులు కార్యాలయం బయటకు వచ్చి కొత్త పిఆర్‌సి జిఓలను వెంటనే రద్దుచేయాలంటూ ఆందోళన చేశారు. పిఆర్‌సి సాధనసమితి నాయకులు మన్నేపల్లి పెంచలరావు, అల్లంపాటి పెంచలరెడ్డి, ఏనుగు రమణారెడ్డి, చేజర్ల సుధాకర్‌రావులతో కలిసి ట్రెజరీ ఉద్యోగులు ఆందోళనలో పాల్గొన్నారు.

## జెన్కోను

# ప్రైవేట్‌పరం చేయొద్దు

ముత్తుకూరు వద్ద ఉన్న జెన్కో విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని ప్రైవేట్‌పరం చేసే ఆలోచనలను ప్రభుత్వం మానుకోవాలని జిల్లాలోని సిపిఎం నాయకులు సూచిం చారు. గతనెల 31న వామపక్ష నాయకుల ఆధ్వర్యంలో నెల్లూరు ట్రంకురోడ్డు వద్ద నుంచి కలెక్టరేట్ దాకా ప్రదర్శన నిర్వ హించి, నిరసన చేపట్టారు. జెన్కో ద్వారా ప్రత్యక్షంగా 2 వేల మందికి, పరోక్షంగా 10వేల మందికి ఉపాధి దొరుకుతోందని, దానిని ప్రైవేట్‌పరం చేయడం అన్యాయ మన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ప్రభాకర్, సిఐటియు నాయకులు మాదాల వెంకటే శ్వర్లు, అజయ్‌కుమార్, గోగుల శ్రీనివా సులు, నాగేశ్వరరావు, కత్తి శ్రీనివాసులు, ఏఐటియుసి నాయకులు రామారాజు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# 'చింతామణి'పై నిషేధం వద్దు

**- నెల్లూరులో కళాకారుల ఆందోళన**




చింతామణి నాటకం పై నిషేధం వద్దంటూ గత నెల 31న నెల్లూరులోని పలువురు కళాకారులు ప్రభుత్వానికి సూచిస్తూ పెద్దఎత్తున ప్రదర్శన నిర్వ హించారు. నిషేధం ఎత్తి వేయాలంటూ జిల్లా కళాకారుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ప్రజానాట్యమండలి కళాకారులు, పౌరాణిక పద్యకళాకారులు పాల్గొని స్థానిక గాంధీబొమ్మ కూడలి వద్ద నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా వచ్చి ఆందోళన చేశారు. చింతామణి పద్యనాటకం దాదాపు వందేళ్ళ క్రితం నాటిదని, నాటి సమాజంలోని సమస్యలను వెలికి తెస్తూ వినోదాత్మకంగా, విజ్ఞానాత్మకంగా నాటకం రూపొందించారని, వేలాదిమంది కళాకారులు నేటికీ ఆ నాటకాన్ని ప్రదర్శిస్తూ జీవనోపాధి పొందుతున్నారని, ఎంతో చరిత్రకలిగిన ఆ నాటకాన్ని నిషేధించడం సముచితం కాదని కళాకారులు పేర్కొన్నారు. అనంతరం డిఆర్‌ఓ చిన్న ఓబులేశుకు వినతిపత్రం సమర్పించారు. కళాకారులు విజయకుమార్, ఎం.పుల్లయ్య, బివైకె యాదవ్, ఎస్‌కె ఖాజామస్తాన్, గంగాధర్‌రెడ్డి, బి.బాబు, చక్రపాణి, భానుమతి, మల్లి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆపద్బాంధవుడు.. 'నెల్లూరు' శ్రీ ప్రసన్న వేంకటేశ్వరుడు

**మన దేవాలయాలు (85)**

***కలియుగ ప్రత్యక్షదైవం.. ఆపద మొక్కులవాడు.. భక్తాభీష్ట ప్రదాయకుడు.. తిరుమలలోని ఆ ఏడుకొండల వేంక టేశ్వరుడు. పిలిచిన పలికే దైవంగా, కోరిన కోర్కెలు తీర్చే ఇలవేలుపుగా శ్రీవారు ప్రపంచ ప్రసిద్ధి. అందుకే దేశవ్యాప్తంగానే కాక, ప్రపంచవ్యాప్తంగా శ్రీ వేంకటేశ్వరునికి అనేకానేక అద్భుతమైన ఆలయాలెన్నో ఉన్నాయి. ఎంతోమంది భక్తులు స్వామివారికి అందమైన కోవెలలు కట్టి నిరంతరం పూజించుకుంటూ తమ జన్మలను సార్థకం చేసుకుంటున్నారు. నెల్లూరు రంగనాయకులపేటలో ఉన్న శ్రీ రంగనాథస్వామి దేవాలయ ప్రాంగణంలో కూడా ఒక భక్తుడు స్వామివారికి ఓ అపురూపమైన ఆలయం నిర్మించి భక్తులకు శ్రీవారి పూజలకు కొదవలేకుండా చేశారు. ఆ అపురూపమైన ఆలయమే..శ్రీదేవి భూదేవి సమేత శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవాలయం. ఈ ఆలయం ఇటీవలే నిర్మించినదైనప్పటికీ స్వామివారిని భక్తితో దర్శించుకున్నవారి కోర్కెలు నెరవేరుతుండడంతో అచిరకాలం లోనే.. భక్తుల పాలిట కొంగుబంగారంగా అలరారుతోంది.***

నెల్లూరులోని శ్రీ రంగనాథస్వామి దేవాలయం రాష్ట్రంలోని ప్రసిద్ధిచెందిన పుణ్యక్షేత్రం. సింహపురి ఆధ్యాత్మిక కీర్తిపతాకగా అనాదిగా ఈ ఆలయం వెలుగొందుతోంది. శ్రీదేవి భూదేవి సమేత శ్రీ రంగనాథుడు గర్భాలయంలో శయనమూర్తిగా కొలువు దీరి ఉంటాడు. పక్కనే రంగనాయకమ్మ అమ్మవారి సన్నిధి, మరోవైపు ఆండాళ్ అమ్మవారి గుడి, ఇంకోవైపు ఆళ్వార్ల మందిరం, భక్తులను ఎంతగానో ఆకట్టుకునే అద్దాల మండపం.. చెంతనే పావన పినాకినీ నది, ఆ సమీపంలోనే కవిబ్రహ్మ తిక్కన మహాభారతాన్ని ఆంధ్రీకరించిన మండపం.. వీటితో పాటు చరిత్రాత్మకమైన ఏడంతస్తుల రాజగోపురం ఈ ఆలయం విశిష్టతలు. ఎంతో విశాలమైన స్థలంలో, ఆధ్యాత్మిక భక్తి వాతా వరణంలో నెలకొని ఉన్న ఈ ఆలయ ప్రాంగణంలోనే మరోవైపు





శ్రీదేవి భూదేవి సమేత శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి వారి ఆలయం నిర్మాణం కూడా ఇటీవలే జరిగింది. శ్రీ రంగనాథస్వామి దేవస్థానం నిర్వాహకుల అనుమతితో నెల్లూరు వాస్తవ్యుడైన శ్రీవేంకటేశ్వరుని భక్తుడు గుమ్మిడేల వెంకటరమణయ్య తన కుమారుని జ్ఞాపకార్థంగా 2007లో ఈ ఆలయాన్ని నిర్మించారు. శ్రీ రంగనాథస్వామి వారి దేవస్థానం ఉపాలయంగా అత్యద్భుతమైన రీతిలో శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని ఆయన సుందరంగా నిర్మించారు. దీంతో రంగనాథస్వామి దేవాలయాన్ని దర్శించుకునే భక్తులకు శ్రీ వేంకటేశ్వరస్వామిని కూడా దర్శించుకునే భాగ్యం కలిగినట్లయింది. గర్భాలయంలో ఎంతో సుప్రసన్నమైన రీతిలో శ్రీ ప్రసన్న వేంకటేశ్వరుడు దర్శనమిస్తుంటాడు. సుమారు అయిదున్నర అడుగుల ఎత్తుగల స్వామివారి విగ్రహమూర్తిని మహాబలిపురంలోని ప్రసిద్ధమైన శిల్పుల చేత అద్వితీయంగా రూపుదిద్దించి ప్రతిష్ఠించారు. శ్రీదేవి భూదేవి అమ్మవార్ల ఉత్సవమూర్తులను కూడా ప్రతిష్ఠ గావించారు. గర్భాలయం చుట్టూ ఉన్న గోడలపై సర్వాంగసుందరంగా చెక్కిన దశావతారాల విగ్రహాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకుంటూ ఉంటాయి. దేవాదాయశాఖ వారు దాతల సహకారంతో ఈ గుడి చుట్టూ గ్రిల్స్ ఏర్పాటుచేసి, ఆలయం ఎదురుగా విశాలమైన స్థలంలో ఆధ్యాత్మిక భక్తి




కార్యక్రమాల నిర్వ హణకు మండపం కూడా నిర్మించారు. రంగనాథాలయం నిర్వాహకులైన ఆలయ ఛైర్మెన్, ఆలయ కార్య నిర్వహణాధికారి, దేవాదాయశాఖ అధికారుల నేతృత్వంలోనే ప్రసన్న వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో కూడా పూజలు సేవలు అనునిత్యం వైభవోపేతంగా జరుగుతుంటాయి.

### నిత్యపూజలు..విశేష సేవలు :

భక్తుల కష్టాలు తీర్చి కోరిన కోర్కెలు తీర్చే శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామికి నిత్యపూజలు, సేవలు కొదవలేకుండా జరుగుతుంటాయి. ఉదయం 6 గంటలకు సుప్రభాతసేవ, 8 గంటలకు ప్రాత:కాలారాధన, 8.30 గంటలకు తొలి నివేదన, ఆ తర్వాత భక్తులకు ఆర్జితసేవలు, 11.30 గంటలకు ద్వితీయ నివేదన జరుగుతాయి. అదేవిధంగా సాయంత్రం 5 గంటల నుంచి పూజలు, 7 గంటలకు సంధ్యారాధన, నివేదన, 8.30 గంటలకు పవళింపు సేవ నిర్వహిస్తారు. ఆలయ అర్చకుడు వాద్యార్ శ్రీనివాసన్ ఆధ్వర్యంలో స్వామివారికి నిత్యపూజలతో పాటు అర్చనలు, పూలంగిసేవ, వస్త్రాలంకార సేవ, సహస్ర నామార్చన తదితర ఆర్జిత సేవలు ఎంతో భక్తిశ్రద్ధలతో జరుగు తుంటాయి. స్వామివారిని తలచుకుంటే చాలు ఆపదలు సమసిపోతాయని, పిలిస్తే పలికే దైవంగా ఉంటూ భక్తులను తన కరుణతో కటాక్షించే శ్రీ ప్రసన్న వేంకటేశ్వరుని దర్శనం ఒక మహద్భాగ్యమని అందరూ భావిస్తుంటారు.

## కళ్యాణ వైభవం...!




గూడూరు రూరల్ వైయస్సార్సీపీ అధ్యక్షులు మల్లు విజయకుమార్‌రెడ్డి - సుపర్ణల కుమార్తె నిఖిత - కౌశిక్‌ల కల్యాణం ఫిబ్రవరి 2వ తేదీ గూడూరులో వైభవంగా జరిగింది. వధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు.

# వాసవి మాత ఆలయంలో.. అగ్నిప్రవేశ ఉత్సవం



అగ్నిగుండంలో నడుస్తున్న భక్తులు

శ్రీ వాసవి మాత ఆత్మార్పణ రోజును పురస్కరించుకుని ఈనెల 2న నెల్లూరు స్టోన్‌హౌస్‌పేటలో ఉన్న శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో అగ్నిప్రవేశ మహోత్సవం భక్తిశ్రద్ధలతో జరిగింది. సుమారు 30 మందికి పైగా భక్తులు 'జై వాసవీమాత' అంటూ నిప్పుల గుండంలో నడిచివెళ్ళారు. బద్వేలుకు చెందిన బ్రహ్మశ్రీ కనుమళ్ళ సత్యనారాయణశర్మ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాసవిమాతకు విశేష పూజలు చేశారు. పినాకిని తీరంలో గంగాదేవి పూజ, నదీస్నానం, కలశతీర్థంతో కలశకుంభ సంప్రోక్షణ తదితర కార్యక్రమాలన్నీ శాస్త్రోక్తంగా నిర్వహించారు. 102 గోత్రీకుల పూర్ణాహుతి సమర్పణ కార్యక్రమం జరిపారు. అమ్మవారిని సింహవాహనంపై కొలువుదీర్చి పూజలు చేశారు. ఆర్యవైశ్యులు పెద్దసంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్తల మండలి గౌరవాధ్యక్షుడు, నుడా ఛైర్మెన్ ముక్కాల ద్వారకానాథ్, ఆలయ ఛైర్మెన్ సుంకు మనోహర్‌తో పాటు ఆర్యవైశ్యప్రముఖులు పబ్బిశెట్టి శ్రీనివాసులు, రామచంద్రరావు, దొంతంశెట్టి వివేకానంద, కోట సూర్యనారాయణ, చలువాది శరణ్ కుమార్, పేర్ల సీతారామారావు, గంగిశెట్టి మల్లి, శ్రీరామ్ సురేష్ తదితరులు పర్యవేక్షించారు.

# తెలుగోళ్ళపై.. సీతమ్మ శీతకన్ను

(మొదటి పేజీ తరువాయి)

అదే పనిని ఆంధ్రాలో జగన్ చేస్తున్నారు. జగన్‌మోహన్‌రెడ్డి అప్పులపై అప్పులు తెస్తూ రాష్ట్రాన్ని తిప్పల పాలు చేస్తున్నాడని పదేపదే విమర్శిస్తున్న రాష్ట్ర బీజేపీ, టీడీపీ నేతలు తాజా కేంద్ర బడ్జెట్‌ని చూసి ఏం మాట్లాడతారో చూడాలి. కాకపోతే ఆయన రాష్ట్ర అభివృద్ధి కోసం కంటే ఉచిత పథకాల కోసం ఎక్కువ ఖర్చు చేస్తున్నారన్న అపవాదును మోస్తున్నారు తప్ప, పాపం... ఆయన అప్పు చేస్తోంది కూడా రాష్ట్ర ప్రజలకోసమే కదా! కేంద్రం చేస్తే ఒప్పు, జగన్ చేస్తే తప్పు అని ప్రతిపక్ష నేతలు విమర్శించడం ఎంతవరకు సబబో వారి విజ్ఞతకే వదిలేద్దాం.

ఇక మన రాష్ట్రం విషయానికి వస్తే, మరోసారి మోదీకి చంద్రబాబు కనిపించారు. గత 8 సంవత్సరాలుగా జరిగిందే ఈసారీ జరిగింది. కేంద్ర ప్రభుత్వం తాజా బడ్జెట్‌లో ఆంధ్రను అన్ని విధాలా పరిహసించింది. అసలు ఆంధ్ర రాష్ట్రాన్ని, ఆ రాష్ట్ర ప్రజలను భారతదేశంలో భాగంగానే గుర్తించినట్లు కనపడలేదు. విభజన తరువాత అన్ని విధాలుగా వెనుకబడిపోయిన నవ్యాంధ్రని అనాథలా వదిలేసింది. ఆర్థికమంత్రి, తెలుగింటి కోడలు సీతమ్మ చేత తెలుగువారిపై శీతకన్ను వేయించారు. 40లక్షల కోట్ల రూపాయల అంచనాతో ప్రతిపాదించిన బడ్జెట్లో అయిదు కోట్ల జనాభా ఉన్న ఆంధ్రకి అధమ స్థానం కల్పించారు. పోలవరం ఊసే లేదు. రామాయపట్నంపై ధ్యాసే లేదు. రాజధాని మాటే వినపడలేదు. ప్రత్యేకహోదా అన్న ఆలోచనే రానీయలేదు. విశాఖ రైల్వేజోనుకు పచ్చజండా ఊపలేదు. కడప ఉక్కు కార్మాగారం గురించి ఒక్క ముక్కైనా చెప్పలేదు. ప్రాజెక్టులు లేవు, పరిశ్రమలు లేవు, పథకాలు లేవు, ఇతర ప్రయోజనాలు అసలే లేవు. రాష్ట్రానికి ఇస్తే ఏంటి.. ఇవ్వకపోతే ఏంటి అన్న చందంగా, శుద్ధంగా అసలేమీ ప్రకటించలేదు.

గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న నరేంద్రమోదీని అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబునాయుడు ఘోరంగా అవమానించినట్టు అప్పుడే వార్తలు వచ్చాయి. అందుకేనేమో మోదీ నేతృత్వంలో భారతీయ జనతా పార్టీ కేంద్రంలో అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ ఆంధ్రకు ద్రోహం చేస్తూనే ఉంది. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పటినుంచి కూడా తెలుగు రాష్ట్రాలలో భారతీయ జనతా పార్టీపైన ప్రజలకు పెద్దగా ఆసక్తి లేదు. తెలుగుదేశంతో దోస్తీ చేసినప్పుడు తప్ప మిగిలిన సమయాలలో పార్టీ లాభపడింది కూడా లేదు. దోస్తీతో కమలానికి లాభం చేకూర్చిన తెలుగుదేశం కూడా స్వప్రయోజనాలు తప్ప రాష్ట్రానికి ఒనగూర్చిందేమీ లేదు. కేంద్ర పెద్దలు గత 8 సంవత్సరాలుగా తెలుగు రాష్ట్రాలను పక్కన పెడుతూనే ఉన్నారు. అసలు తెలుగు ప్రజలు భారతదేశంలో భాగం కాదన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ముఖ్యంగా ఉమ్మడి రాష్ట్రాన్ని రెండు ముక్కలుగా చేయడంలో అన్ని పార్టీలతో పాటు భారతీయ జనతా పార్టీ కూడా చేయి కలిపింది. రాష్ట్రం విడిపోయి 8 సంవత్సరాలు అవుతుంటే ఇప్పటికి ఒక్కసారైనా రాష్ట్రానికి మంచి జరిగే ప్రతిపాదన తెరపైకి తేలేదు. బడ్జెట్ ప్రకటించిన ప్రతిసారీ ఆశగా ఎదురుచూసిన తెలుగు గుండెకు నిరాశే ఎదురయ్యింది. కేంద్ర పెద్దల నిర్లక్ష్యానికి, సవతి ప్రేమకి రాష్ట్రం బలైపోతూనే వుంది. ప్రతిసారీ బడ్జెట్ ప్రకటించే సమయానికి దగ్గరలో ఎన్నికలు జరగబోయే రాష్ట్రాలకు తాయిలాల వరాలు ప్రకటించే భాజపా, చంద్రబాబు పుణ్యమా అని ఆంధ్రకు మాత్రం మొండిచేయి చూపడంతప్ప.. ఎప్పుడూ ఎలాంటి ప్రయోజనాలూ చేకూర్చడంలేదు. ఇప్పటికే దీన స్థితిలో ఉన్న ఆంధ్ర విషయంలో కేంద్రం ఇదే వైఖరిని ప్రదర్శిస్తూపోతే మోడీ హయాంలో అభివృద్ధిపరంగా ఆంధ్రప్రదేశ్ వందేళ్ళు వెనుకబడిపోవడం తథ్యం.

# 'తగ్గేదే లే' అంటున్న కోవిడ్

## మరో 501 మందికి కరోనా

కరోనా ఇప్పట్లో 'తగ్గేదే లే' అంటోంది. గత కొద్దిరోజులుగా వెయ్యికి పైగానే ఉన్న కేసులు ఇప్పుడు వందల్లోకి వచ్చినా, పూర్తిస్థాయిలో తగ్గేటట్టు కనిపించడం లేదు. అధికారులు, వైద్యులు నిరంతరం ఈ వ్యాధి నివారణకు కృషి చేస్తున్నా ఒక్కోసారి తగ్గినట్లు అనిపిస్తుంటుంది కానీ, మళ్ళీ వీరంగం చేస్తూనే ఉంటోంది. ఈ నెల 3వ తేదిన జిల్లాలో 501 మందికి కోవిడ్ పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. అయితే 500కు పైగా కేసులు ఒకేరోజున రావడం కోవిడ్ వ్యాప్తి తీవ్రతను తెలియజేస్తూనే ఉంది. కాగా, నెల్లూరు పెద్దాసుపత్రిలో ఈ వ్యాధితో చికిత్స పొందుతున్న వారిలో ఈనెల 2న ఒకరు మృతి చెందారు. దీంతో జిల్లాలో ఇప్పటికే ఈ మహమ్మారి వ్యాధితో మృతి చెందిన వారి సంఖ్య 1080కి చేరింది. జిల్లాలో ఇప్పటిదాకా 1,63,038 మందికి కరోనా సోకగా, వారిలో 1,52,268 మంది కోలుకున్నారు. ప్రస్తుతం ఇంకా 9,690 యాక్టివ్ కేసులున్నాయని వైద్యవర్గాలు పేర్కొంటున్నాయి. కరోనా తగ్గుతున్నట్లు అనిపించినా దానిని నమ్మడానికి లేదని, పొంచి ఉండి మళ్ళీ విజృంభించవచ్చని, కనుక ప్రజలందరూ అప్రమత్తంగా ఉంటూ కోవిడ్ నిబంధనలను అనుసరించాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

## పాలనా సౌలభ్యం కోసమే..

# పోలీస్ డివిజన్ల ఏర్పాటు

**- డిఐజి త్రివిక్రమవర్మ**

రాష్ట్ర ప్రభుత్వం కొత్త జిల్లాలు ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో పరిపాలనా సౌలభ్యం కోసం పోలీస్ డివిజన్లు ఏర్పాటుచేయాలని గుంటూరు రేంజ్ డిఐజి త్రివిక్రమవర్మ జిల్లా పోలీసు అధికారులకు సూచించారు. ఈనెల 2న ఆయన నెల్లూరుకు వచ్చారు. జిల్లాలోని సూళ్ళూరుపేట, వెంకటగిరి, గూడూరు నియోజకవర్గాలు బాలాజీ జిల్లాకు మారుతుండడం, నెల్లూరు నగరం, నెల్లూరు రూరల్, కావలి, కోవూరు, సర్వేపల్లి, ఉదయగిరితో పాటు కొత్తగా కందుకూరు నియోజకవర్గం నెల్లూరుజిల్లాలో కలుస్తుండడంతో ఈ నేపథ్యంలో పోలీస్‌స్టేషన్ల భౌగోళిక స్వరూపం మారనుందని ఆయన చెప్తూ అందుకు సంబంధించిన పలు అంశాలను పోలీసు అధికారులతో చర్చించారు. ఆమేరకు తగు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. తొలుత డిఐజిని జిల్లా ఎస్పీ సిహెచ్ విజయారావు మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతించారు.

## బలరామయ్యనాయుడు @ 65



ప్రపంచం తెలుగు సమాఖ్య రీజనల్ కో-ఆర్డినేటర్, వాకర్స్ క్లబ్‌లో ఉత్సాహవంతమైన లీడర్, అనేక సాహిత్య, సంస్కృతిక సంస్థల వెల్‌విషర్ నలుబోలు బాలరామయ్యనాయుడు 65వ పుట్టినరోజు సందర్భంగా, ఫిబ్రవరి 3వ తేదీన వెరైటీగా 65 రకాల ఆహార పదార్థాలతో ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఆయన మనుమరాలు నలుబోలు హాసిని. యథా తాతయ్య.. తథా మనుమరాలు.

# కంచే చేను మేసింది

- ఏసిబి వలకు చిక్కిన 'సెబ్' కానిస్టేబుళ్ళు
- ఇద్దరినీ సస్పెండ్ చేసిన సెబ్ కమిషనర్



ఏసిబికి పట్టుబడిన హెడ్‌కానిస్టేబుల్, కానిస్టేబుల్

కంచే చేను మేసిందన్న సామెత అక్షరాలా రుజువుచేసే సంఘటన ఇది. అవినీతి అక్రమాలను అరికట్టేందుకు నియమించబడిన వారే అవినీతికి పాల్పడి, చివరికి పోలీసులకు దొరికిపోయారు. సెబ్ అధికారులు జిల్లాలో సంచలనం సృష్టిస్తూ అనేక అక్రమాలను నివారిస్తూ ప్రజల అభిమానం పొందుతుంటే అందులో పనిచేసే సిబ్బంది కొందరు అవినీతికి పాల్పడుతూ ఆ శాఖకే అప్రతిష్ట తెస్తుండడం విచారకరం. ఓ చిన్న కూల్‌డ్రింక్ షాపు పెట్టుకుని జీవించే ఒక వ్యక్తినుంచి లంచం తీసుకుంటూ నాయుడుపేట సెబ్ కానిస్టేబుళ్లు అవినీతి నిరోధకశాఖ(ఏసిబి) అధికారులకు చిక్కిపోయారు. బాధితుడి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నాయుడుపేటలో ప్రతాప్‌రెడ్డి కూల్‌డ్రింక్ షాపు పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. దుకాణంలో మద్యం అమ్ముతున్నారని, అక్కడనే కూర్చోబెట్టి మద్యం తాగిస్తున్నారంటూ సెబ్ పోలీసులు తనను వేధింపులకు గురిచేసే వారని, అడిగినంత మొత్తం ఇవ్వకపోవడంతో కేసులు పెడతామని బెదిరించారని బాధితుడు వాపోయాడు. ప్రతినెలా 10వేలు ఇవ్వకుంటే కేసులు పెడతామన్నారని, దీంతో తాను ఏసిబిని ఆశ్రయించానని పేర్కొన్నాడు. దీంతో ఏసిబి అధికారులు రంగంలోకి దిగి వారిని పట్టుకునేందుకు వ్యూహం సిద్ధం చేశారు. ఈనెల 2న ప్రతాప్‌రెడ్డి నుంచి హెడ్‌కానిస్టేబుల్ విశ్వనాథం సూచనతో కానిస్టేబుల్ బాలవర్ధన్ 10వేలు లంచం తీసుకుంటుండగా ఏసిబి అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నెల్లూరు ఏసిబి డిఎస్పీ మోహన్ ఆధ్వర్యంలో సిఐలు వేణు, శ్రీనివాసరావు, రమేష్, శ్రీనివాస్ తమ సిబ్బందితో కలిసివెళ్ళి వారిద్దరినీ అరెస్ట్ చేశారు. సెబ్ కార్యాలయంలో తనిఖీలు చేశారు. సెబ్ కమిషనర్ వినీత్‌బ్రిజ్‌లాల్‌కు వీరి వ్యవహారం తెలియజేశారు. దీంతో వారిద్దరినీ కమిషనర్ సస్పెండ్ చేశారు.



# నెల్లూరు నగర మాజీ ఎమ్మెల్యే

# ముంగమూరు.. ఇక లేరు

## • కడసారి కన్నీటి నివాళులర్పించిన నాయకులు

***సౌమ్యుడు, వివాదరహితుడు, అందరికీ ఆత్మీయుడు.. నెల్లూరు నగర మాజీ ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి ఇక లేరు. గతనెల 31వతేది సోమవారం మధ్యాహ్నం అనారోగ్యంతో పరమపదించారు. ఆయన మరణవార్త విన్నవారంతా దిగ్భ్రాంతికి గురయ్యారు. గత కొంతకాలంగా ఆయన క్యాన్సర్ వ్యాధితో బాధపడుతుండేవారు. చెన్నైలో చికిత్స చేసుకుంటూ ఇటీవలే తిరిగి నెల్లూరుకు వచ్చారు. ఉన్నట్లుండి పల్స్ అందకపోవడంతో ఆయన కుప్పకూలిపోయి మరణించారు. రాజకీయరంగంలో ఎంతో సౌమ్యునిగా ఉంటూ నెల్లూరు నగరాభివృద్ధికి తనవంతు కృషిచేసిన శ్రీధరకృష్ణారెడ్డి మృతి అందరినీ బాధించింది. ఆయన మరణంతో నెల్లూరులో విషాదం అలముకుంది. మంగళవారం మధ్యాహ్నం జరిగిన ఆయన అంతిమ యాత్రలో అనేకమంది నాయకులు, ప్రజలు పాల్గొని ఆయనకు కడసారి కన్నీటి నివాళులర్పించారు.***

నెల్లూరు రాజకీయాల్లో ముంగమూరు శ్రీధర కృష్ణారెడ్డిది ఒక ప్రత్యేక శైలి. స్వతహాగా సౌమ్యుడు. వివాదరహితుడు. జగడాల జోలికి పోయేవాడు కాదు. ఎప్పుడూ చిరునవ్వుతో ఉండడం, నిగర్వంగా నిరాడంబరంగా జీవించడం ఆయనకు అలవాటు. అందరితో అభిమానంగా ఉండడం, చిన్నా పెద్దా తేడా లేకుండా కలుపుగోలుగా మాట్లాడడం ఆయన తత్వం. ఆ మనస్తత్వమే ఆయనకు రాజకీయాల్లో కూడా గుర్తింపు తెచ్చిపెట్టింది. రాజకీయాల్లో ఉన్నా, రాజకీయాలకంటే మానవసంబంధాలకే ఆయనెంతో ప్రాధాన్యత ఇచ్చేవారు. తమ పార్టీలోనే కాక ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలతో కూడా సఖ్యంగా ఉండేవారు. నెల్లూరు మునిసిపల్ కౌన్సిలర్‌గా, నెల్లూరు నగర ఎమ్మెల్యేగా ఆయన అమూల్యమైన సేవలందించి ప్రజల గుండెల్లో తనకంటూ చిరస్మరణీయమైన స్థానాన్ని సంపాదించుకున్నారు.

### ఎన్టీఆర్ అంటే అభిమానం :

ప్రత్యేకించి ముంగమూరుకు తొలినుంచీ ఎన్టీఆర్ అంటే ఎనలేని అభిమానం. ఆ ప్రేమతోనే ఆయన తెలుగు దేశంలో చేరి ఆ పార్టీ అభ్యున్నతికి కృషిచేశారు. నిబద్ధతతో పనిచేసి మంచి నాయకునిగా పేరు తెచ్చుకున్నారు. చిన్నస్థాయి నుంచి అంచలంచెలుగా ఎదుగుతూ టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్ష పదవిని కూడా పొందారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు వెన్నంటే ఉండి పార్టీ బలోపేతానికి తాను చేయదగ్గ కృషినంతా చేశారు. 1987 నుంచి రెండుసార్లు టిడిపి తరఫున పోటీచేసి మునిసిపల్ కౌన్సిలర్‌గా విజయం సాధించి ప్రజలకు సేవలందించారు. 2000 నుంచి 2008 దాకా టిడిపి నెల్లూరు నగర శాఖ అధ్యక్షునిగా పార్టీకి మంచి గుర్తింపు తెచ్చారు. తెలుగుయువత జిల్లా అధ్యక్షునిగా, నెల్లూరు నగర టిడిపి అధ్యక్షునిగా ఆయన చేసిన సేవలు అమూల్యం.

### ప్రజారాజ్యం నుంచి ఎమ్మెల్యేగా :

ఆ తర్వాత కారణాంతరాల వల్ల తెలుగుదేశం పార్టీని వదిలిపెట్టి, మెగాస్టార్ చిరంజీవి స్థాపించిన 'ప్రజారాజ్యం' పార్టీలో చేరారు. 2009లో జరిగిన ఎన్నికల్లో ఆ పార్టీ తరఫున పోటీచేసి విజయం సాధించారు. అప్పట్లో జిల్లాలో ప్రజారాజ్యం పార్టీ నుంచి నిలిచి గెలిచిన ఏకైక నాయకుడు ఒక్క ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డే కావడం విశేషం. ఆ తర్వాత ప్రజారాజ్యం పార్టీ అప్పట్లో అధికార పార్టీగా ఉన్న కాంగ్రెస్‌లో విలీనం కావడంతో శ్రీధరకృష్ణారెడ్డి కూడా కాంగ్రెస్ ఎమ్మెల్యేగానే కొనసాగారు.



ముంగమూరు పార్థివ దేహం వద్ద నివాళులర్పిస్తున్న తెలుగుదేశం పార్టీ నాయకులు

### మళ్ళీ తనకిష్టమైన టిడిపిలోకి :

రాష్ట్ర విభజన నేపథ్యంలో కాంగ్రెస్‌లో ఉండలేక.. ఆ తర్వాత 2014లో మళ్ళీ తెలుగుదేశం పార్టీలోకి వచ్చేశారు. సొంతగూటికి వచ్చిన ముంగమూరుకు టిడిపిలో ముందుకన్నా ఎక్కువ ప్రాధాన్యతే లభించడం విశేషం. నగరంలోని ఆత్మకూరు బస్టాండ్ వద్ద నుంచి స్టోన్‌హౌస్‌పేటకు వెళ్లే దారిలో ఉన్న సర్వేపల్లి కాలువపై ప్రజల సౌకర్యార్థం రెండు వంతెనల నిర్మాణం చేయించారు. మినీబైపాస్‌రోడ్డు, స్టోన్‌హౌస్‌పేట రోడ్ల వగైరాలను మరమ్మతులు చేయించి అభివృద్ధి చేశారు. 2014 ఎన్నికల్లో మళ్ళీ నెల్లూరు నుంచే పోటీచేసి ఓటమిపాలైనా ఏమాత్రం నిరాశ చెందక రాజకీయాల్లో ఇవన్నీ సాధారణమే నంటూ ఓటమిని చిరునవ్వుతోనే స్వీకరించి, ప్రజా జీవితంలో మరింత ఉత్సాహంతో రాణించారు. రాష్ట్రంలో టిడిపి అధికారంలో ఉన్న కాలంలో టిడిపి నెల్లూరునగర ఇన్‌చార్జి నాయకునిగా గుర్తింపు పొందారు. 2019 ఎన్నికల తర్వాత టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షునిగా చురుగ్గా పనిచేస్తున్న నేపథ్యంలో ఇటీవల క్యాన్సర్ వ్యాధి ఆయన్ను బాధలకు గురిచేయడంతో ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉంటూ వచ్చారు. క్యాన్సర్‌ను జయించి ఆయన మళ్ళీ నెల్లూరు నగర నేతగా వస్తాడనుకున్న ప్రజల ఆశలు నిరాశాలుగానే మిగిలిపోయాయి. ఆయన మృతితో నెల్లూరు నగరం ఒక ఆత్మీయ నాయకుడిని కోల్పోయినట్లయింది.

### ప్రముఖుల నివాళి :

శ్రీధరకృష్ణారెడ్డి మరణవార్త తెలియడంతోనే భారత ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు విచారం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబసభ్యులకు తన సంతాపం ప్రకటించారు. టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఫోన్‌లో ముంగమూరు కుటుంబసభ్యులను పరామర్శించారు. ముంగమూరు మృతికి విచారం వ్యక్తం చేస్తూ వారి కుటుంబానికి సంతాపం ప్రకటించారు. ఎన్టీఆర్ తనయుడు నందమూరి బాలకృష్ణ శ్రీధరకృష్ణారెడ్డి కుమారుడు చైతన్యతో మాట్లాడి ఓదార్చారు. ముంగమూరు కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సంతాపం తెలియజేశారు. ముంగమూరు సమీప బంధువు రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి శ్రీధరకృష్ణారెడ్డి పార్థివదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. ముంగమూరు మరణం తమకు తీర్చలేని లోటని వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, డిసిసిబి మాజీఛైర్మెన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, మాజీ మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, పొంగూరు నారాయణ, టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి బీదా రవిచంద్ర, మాజీ కేంద్రమంత్రి పనబాక లక్ష్మి, సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి, టిడిపి నాయకులు అబ్దుల్ అజీజ్, టిడిపి నగర ఇన్‌చార్జి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ధర్మవరపు సుబ్బారావు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి, పలు పార్టీల నేతలు, కార్యకర్తలు, పెద్దసంఖ్యలో ప్రజలు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

### పాడె మోసిన విపిఆర్



ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి అంతిమయాత్రలో పాల్గొన్న రాజ్యసభసభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి స్వయంగా పాడె మోసి ముంగమూరుపై తనకున్న ఆత్మీయతను చాటుకున్నారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి, మాజీమంత్రి తాళ్ళపాక రమేష్‌రెడ్డి, తాళ్ళపాక అనూరాధ, విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కురుగొండ్ల రామకృష్ణ, పాశం సునీల్‌కుమార్, కొమ్మి లక్ష్మయ్యనాయుడు, కంభం విజయరామిరెడ్డి, నుడా ఛైర్మెన్ ముక్కాల ద్వారకనాథ్, మాజీఎమ్మెల్యే స్వర్గీయ ఆనం వివేకానందరెడ్డి కుమారులు ఆనం రంగమయూర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, వైకాపా రాష్ట్ర కార్యదర్శి వై.వి.రామిరెడ్డిలతో పాటు జనసేన, వామపక్షాలు, పలు పార్టీల నాయకులు, కార్యకర్తలు అనేకమంది ఆయన అంతిమయాత్రలో పాల్గొన్నారు.

---

### పాత పద్ధతిలోనే..

## వెంకటగిరికి బస్సుల రాకపోకలు

**- ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి**



వెంకటగిరి పట్టణంలో నిత్యం ఎదురయ్యే ట్రాఫిక్ సమస్యలను నివారించేందుకు అధికారులు తగు శ్రద్ధ తీసుకుంటున్నారని, ఆర్టీసి బస్సులను ప్రయాణీకుల సౌలభ్యం దృష్ట్యా పాత పద్ధతిలోనే వెంకటగిరి పాత బస్టాండ్ మీదుగా తిరిగే విధంగా తాత్కాలికంగా నిర్ణయించామని మాజీమంత్రి, వెంకటగిరి శాసనసభ్యులు ఆనం రామనారాయణరెడ్డి చెప్పారు. ఈనెల 2న 'స్పందన' కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ఈ విషయం తెలియజేశారు. పట్టణ ప్రజలందరికీ, అన్నివర్గాల వారికి ఆమోద యోగ్యమైన నిర్ణయాలతో భవిష్యత్తులో ట్రాఫిక్ సమస్యల నివారణ కోసం ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తామని ఆయన చెప్పారు. ఈ సమావేశంలో గూడూరు డిఎస్పీ రాజగోపాల్‌రెడ్డి, మునిసిపల్ ఛైర్‌పర్సన్ భానుప్రియ, వైస్‌ఛైర్మెన్లు, మునిసిపాలిటీ కౌన్సిలర్లు, మునిసిపల్, ఆర్టీసి అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

### వివాహ రజతోత్సవాన

## 'ప్రగతి' సేవా పరిమళాలు



అరుదైన తేదీ 02.02.22న తమ వివాహ రజతోత్సవాన్ని పురస్కరించుకుని గూడూరు ప్రగతి సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్-లక్ష్మీదేవి దంపతులు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఆరోజు ఉదయం బాలాజీనగర్ పోలేరమ్మ గుడి వద్ద ప్రగతి కార్యాలయంలో 50 మంది మహిళలకు చీరలను బహూకరించగా, మధ్యాహ్నం సాయిరాం చారిటీస్‌లో విందు భోజనాలను వడ్డించారు. ఈ కార్యక్రమాల్లో ఉపాధ్యక్షుడు బండి ధనంజయరెడ్డి, సెక్రెటరీ చంద్రశేఖర్, జాయింట్ సెక్రటరీ యమహా సుబ్రమణ్యం, ట్రెజరర్ కాటూరు శ్రీనివాసులు, పొణకా మల్లికార్జునరెడ్డి, సాయిరామ్ చారిటీస్ నిర్వాహకురాలు కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.



భారత ప్రభుత్వ గుర్తింపు కలిగిన ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డు కులాల సంక్షేమ సంఘానికి అనుబంధంగా ఆంధ్రప్రదేశ్ అంబేద్కర్ యువజన సంఘం చిత్తూరు రూరల్ మండల శాఖ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆ సంఘ నాయకులు నాగిశెట్టి ధర్మయ్య తదితరులు.

---

## 'తలసేమియా' వ్యాధిపై అవగాహన సదస్సు





నెల్లూరు డికెడబ్ల్యు కళాశాలలో ఈనెల 2న 'తలసేమియా' వ్యాధి పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ అవగాహన సదస్సు నిర్వహించారు. నెల్లూరులోని ఇండియన్ రెడ్‌క్రాస్ వారి సహకారంతో కళాశాల ప్రధానాచార్యులు డా. డి.గిరి అధ్యక్షతన జంతుశాస్త్ర విభాగం వారు ఈ కార్యక్రమం చేపట్టారు. ముఖ్యఅతిథిగా చెన్నై అపోలో ఆసుపత్రి పీడియాట్రిక్ హెమటాలజిస్ట్ డాక్టర్ రమ్య పాల్గొని వ్యాధి లక్షణాలను, వ్యాధి వస్తే చేయించుకోవాల్సిన చికిత్సలను, వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థినులకు వివరించారు. రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు సీత, పర్వీన్‌లు, కళాశాల జంతు శాస్త్ర విభాగం ఆచార్యులు డాక్టర్ శ్రీరంజని, రమాదేవి, అనిత, లలిత, నాగరాజుతో పాటు అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

## కలువాయి పిహెచ్‌సికి కోవిడ్ కిట్లు

కలువాయి మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రెడ్‌క్రాస్ జిల్లాశాఖ ఛైర్మెన్ పి.చంద్రశేఖర్ రెడ్డి సహకారంతో 70 కోవిడ్ మెడికల్ కిట్లు ఈనెల 1న వితరణగా అందజేసి కోవిడ్ బాధితులకు తమ వంతు చేయూతనందించారు. కలువాయి సబ్‌బ్రాంచ్ ఛైర్మెన్ జి.పెంచలపుల్లయ్య వాటిని మండల వైద్యాధికారి డాక్టర్ సురేంద్రబాబుకు అందజేశారు.

# రామానుజుల ప్రాభవం.. ఆధ్యాత్మిక వైభవం

***కులమతాలు, జాతిభేధాలు వద్దంటూ సమాజానికి అసలైన ఆధ్యాత్మిక విజ్ఞానం పంచిన పరమాచార్యుని స్మరించుకుంటూ జరుపుకునే వెలుగుల పండుగ ఇది. అందుకే ప్రపంచవ్యాప్తంగా ప్రఖ్యాతి చెందిన తిరుమల ఏడుకొండలవాని దివ్యక్షేత్ర వైభవాన్ని, ఢిల్లీలోని అక్షరధామ్ వంటి ఆధ్యాత్మిక భవ్యక్షేత్రాలను తలపించేవిధంగా శ్రీ రామానుజుల వారి ప్రాంగణాన్ని అత్యంత రమణీయంగా..భక్తిభావ సమన్వితంగా నిర్మించడం విశేషం. ఇదంతా శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్ స్వామివారి సంకల్పబలంతోనే జరిగింది. ఏళ్ల తరబడిగా ఎంతగా శ్రమించారో ఏమో!.. ఇంతటి బృహత్తర, మహత్తర.. లోకోత్తరమైన కార్యక్రమం నిర్వహించడం శ్రీ చిన్నజీయర్ స్వామివారికే సాధ్యమైంది.***

భగవంతుడిని సేవించడానికి కావాల్సింది కులం కాదు, మతం కాదు.. చిత్తశుద్ధి. కులం, మతం మనిషిని గొప్పవారిని చేయలేవు. ఆధ్యాత్మికత, అంకితభావం, కట్టుబాట్ల వల్ల మనిషి గొప్పవాడవుతాడు'.. అంటూ ప్రబోధించిన మహాతత్వవేత్త.. మహా మానవీయమూర్తి... శ్రీ భగవద్రామానుజుల వారు. కులవివక్ష, పేద ధనిక తేడాలు, సమాజంలో దురాచారాలు, అసమానతలు వగైరాలన్నిటిపైనా పోరాడిన మహా యోగి శ్రీ రామానుజాచార్యుల వారు. వెయ్యేళ్ళయినా ఆయన సమతా భావం.. సమానత్వ నినాదం నేటికీ ప్రజల హృదయాల్లో స్ఫూర్తిని నింపుతూనే ఉన్నాయి.

సమాజంలో జ్ఞానకాంతులను ప్రకాశింపజేసిన ఆ మహనీయునికి..దేశంలోనే ఎంతో అపురూపమైన విధంగా విగ్రహం ప్రతిష్టించబడడం..ఒక అద్భుతం. శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్ స్వామివారి సారధ్యంలో హైదరాబాద్‌లోని శంషాబాద్ వద్ద ఉన్న ముచ్చింతల్ సమీపంలో శ్రీరామనగరంలో ఈ అద్వితీయమైన ఆధ్యాత్మిక ప్రాంగణం రూపుదిద్దుకుంది. ఎన్నెన్నో ప్రత్యేకతలున్న ఈ ఆధ్యాత్మిక దివ్యధామం ఎంతో ఆకర్షణీయంగా ఉంటుంది. ప్రాంగణం చుట్టూ 108 వైష్ణవ దివ్యాలయాలు నేత్రపర్వం చేస్తుంటాయి. వాటన్నిటి మధ్యలో అత్యంత సుందరమైన.. భగవద్రామానుజుల విగ్రహం..పద్మాసనస్థితిలో సుప్రశాంత వదనంతో ప్రతిష్టితమై దేదీప్యమానంగా దర్శనమిస్తోంది. అదిగో!...అల్లంత ఎత్తున కనిపించే..216 అడుగుల 'సమతామూర్తి' విగ్రహం..భావితరాలకు స్ఫూర్తి..భారతావనికే కీర్తి!...అఖిల మానవాళికే దివ్యదీప్తి!.. అమూల్యమైన మన భారతీయ వారసత్వ సంపదకు, సమున్నతమైన సమతా చిహ్నానికి.. ఇదో అద్వితీయమైన రూపం. 'స్టాట్యూ ఆఫ్ ఈక్వాలిటీ'.. అంటే సమానత్వానికి ప్రతిరూపం. ప్రపంచంలోనే రెండవ అతిపెద్దదైన పద్మాసన స్థితిలో ఉన్న ప్రతిమగా ఈ విగ్రహం ప్రఖ్యాతిని అందుకుంటోంది. ఒక్క తెలుగువారికే కాదు..భరతజాతికీ.. సకల ప్రపంచానికీ ఇదెంతో గర్వకారణం!

## సమతామూర్తికి పుట్టిన రోజు కానుక :

భగవద్రామానుజుల సిద్ధాంతాలను ప్రపంచవ్యాప్తం చేయాలనే సంకల్పంతో శ్రీ చిన్నజీయర్ స్వామివారు ఈ బృహత్తర కార్యానికి శ్రీకారం చుట్టారు. ఎంతో సమున్నతమైన రామానుజుల వారి విగ్రహానికి...'సమతామూర్తి' అని నామకరణం చేశారు. వెయ్యేళ్ళు నిలిచి ఇంకా వెలుగుతున్న శ్రీ రామానుజుని వెయ్యేళ్ళ పుట్టిన రోజు కానుకగా శ్రీ చిన్నజీయర్ స్వామివారు ఈ అద్వితీయమైన ఆధ్యాత్మిక కార్యక్రమానికి ఆద్యులయ్యారు. ప్రపంచంలో అనేక విగ్రహాలున్నాయి. ఆయా దేశాల ప్రజల్లో ఎంతో స్ఫూర్తిని కలిగిస్తుంటాయి. అమెరికాలోని న్యూయార్క్‌లో 'స్టాట్యూ ఆఫ్ లిబర్టీ' (స్వాతంత్ర్యమూర్తి) విగ్రహం వాటిలో చెప్పుకోదగ్గది. అదేవిధంగా మనదేశంలో గుజరాత్‌లో ఇటీవలే 'స్టాట్యూ ఆఫ్ యూనిటీ' (సమైక్యతామూర్తి)గా సర్దార్ వల్లభాయ్‌పటేల్ విగ్రహం నెలకొల్పడం విశేషం. ఇప్పుడు తెలంగాణాలో 'స్టాట్యూ ఆఫ్ ఈక్వాలిటీ' (సమతామూర్తి)గా భగవద్రామానుజుల వారి విగ్రహం ప్రతిష్టించబడడం దేశానికే గర్వకారణం.



## మహాద్భుతంగా 'సహస్రకుండాత్మక మహాలక్ష్మీనారాయణ యజ్ఞం'

హైదరాబాద్ సమీపంలోని శంషాబాద్ శ్రీరామప్రాంగణంలో నెలకొల్పిన 216 అడుగుల భగవద్రామానుజుల విగ్రహం..దేశంలోనే మరో దివ్యమైన ఆధ్మాత్మికశిఖరంగా భాసిస్తోంది. 108 దివ్యాలయాలతో ఈ ప్రాంగణం అలరారుతోంది. ఫిబ్రవరి 2 నుంచి 14 దాకా 12 రోజుల మహాయజ్ఞ క్రతువులతో ఈ ప్రాంగణం కళకళలాడుతోంది. 1035 యాగకుండాలు, 5000 మంది రుత్విక్కులతో మహాశక్తివంతమైన సహస్రకుండాత్మక మహాలక్ష్మీనారాయణ యజ్ఞం కూడా నిర్వహిస్తున్నారు. శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజియ్యర్ స్వామివారి సంకల్పబలంతోనే ఈ కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరుగుతున్నాయి. ఈనెల 5న అద్వితీయమైన భగవద్రామానుజుల విగ్రహ విష్కరణ ప్రధాని నరేంద్రమోడీ చేతులమీదుగా అత్యంత వైభవంగా జరుగనుంది.

## వెయ్యేళ్ళయినా చెక్కుచెదరని.. అద్భుతమైన విగ్రహం

శ్రీ రామానుజాచార్య సమతామూర్తి స్ఫూర్తి కేంద్రం నిర్మాణం 2014లో ప్రారంభమైంది. దాదాపు 45 ఎకరాల విస్తీర్ణంలో మరో వెయ్యేళ్ళయినా సరే చెక్కుచెదరకుండా భగవద్రామానుజుల వారి విగ్రహాన్ని రూపొందించారు. తెలంగాణలోని రంగారెడ్డిజిల్లా శంషాబాద్ మండలం ముచ్చింతల్ సమీపంలో శ్రీరామనగరంలో ఈ ఆధ్యాత్మికక్షేత్రం నెలకొల్పారు. భగవద్రామానుజుల విగ్రహం ఎత్తు మొత్తం..216 అడుగులు. ఇందులో రామానుజస్వామి విగ్రహం ఎత్తు 108 అడుగులు. పద్మపీఠం 27 అడుగులు. భద్రవేదిక 54 అడుగులు. త్రిదండం 135 అడుగులు ఎత్తుగా నిర్మించారు. విగ్రహం చుట్టుకొలత 108అడుగుల దాకా ఉంటుంది. 1800 టన్నుల పంచలోహాలతో చైనాలో ఈ విగ్రహాన్ని రూపుదిద్దించారు. ఆ చెంతనే ఉన్న మూడంతస్తుల భవనంలో భగవద్రామానుజుల చరిత్రను, తత్వాన్ని తెలిపే చిత్రాలు ఉంటాయి. 120 ఏళ్ళు జీవించిన రామానుజుల స్వామివారికి నిండునీరాజనాలతో 120 కిలోల బంగారుతో తయారుచేసిన అయిదుడుగులా మూడంగుళాల విగ్రహం భక్తులకు నేత్రపర్వం చేస్తుంది. మరో అంతస్తులో వేదిక, డిజిటల్ లైబ్రరీ, పరిశోధనాకేంద్రం నెలకొల్పారు. రాజస్థాన్ నుంచి ప్రత్యేకంగా తెప్పించిన గులాబీరంగు గ్రానైట్‌తో తయారుచేసిన పలు శిలాకృతులు కనువిందుగా ఉంటాయి. దాదాపు వెయ్యి కోట్ల రూపాయల అంచనా వ్యయంతో నిర్మించిన భగవద్రానుజుల కేంద్రంలో పండితులకు ఎన్నో వేదికలు, ఆడిటోరియంలు ఉన్నాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే యాత్రికులు, భక్తులు ఈ క్షేత్రాన్ని సందర్శించుకునేవారికి వెసులుబాటుగా ఉండేందుకు సెల్ఫ్‌గైడెడ్ టూల్‌తో ప్రత్యేక ఇయర్‌ఫోన్స్ ద్వారా తమకు తెలిసిన భాషలో ఈ క్షేత్ర విశేషాలను తెలుసుకునే ఏర్పాట్లు కూడా చేశారు. ప్రధాన వాస్తుశిల్పి, చీఫ్ ఆర్కిటెక్ట్ ప్రసాద్ ఆధ్వర్యంలో ఈ ఆలయసముదాయం సర్వాంగసుందరంగా ఏర్పాటైంది. ఆగమ సాముద్రికశాస్త్రాల్లో సిద్ధహస్తుడైన ఆయన, జీయర్‌స్వామి ఆదేశాలతో 92 దివ్య దేశాలను సందర్శించి ప్రపంచంలోని ప్రసిద్ధమైన విగ్రహాలను పరిశీలించి భగవద్రామానుజులవారి విగ్రహాన్ని శిల్పవాస్తుశాస్త్ర కళలతో అత్యద్భుతంగా నిర్మించారు.

## దివ్యజ్ఞాన శిఖరం.. భగవద్రామానుజులు

శ్రీశ్రీశ్రీ భగవద్రామానుజాచార్యుల వారంటే భారతీయ ఆధ్యాత్మిక శిఖరం. దివ్యజ్ఞానానికి ఆయనో కేతనం. ఇన్నేళ్ళ తర్వాత కూడా ఆయన్ను మనమంతా స్మరించుకుంటున్నామంటే అది ఆ మహాత్ముని గొప్పదనానికి నిదర్శనం. భగవదారాధనకు కులమతాలు ప్రాతిపదిక కాదన్న సమతామూర్తి.. శ్రీ రామానుజాచార్యుల వారు. భగవంతుడు ఏ కొందరివాడో కాదని, అందరివాడని నిర్భయంగా చాటి, నాటి సమాజంలోని అంటరానితనం వంటి ఛాందసభావాలపై ధ్వజమెత్తి, ప్రజల్లో ఉన్న అజ్ఞానపు చీకట్లను పారద్రోలి, ఆధ్యాత్మిక దివ్యజ్ఞాన కాంతులను వెదజల్లిన సమతామూర్తి.. భగవద్రామానుజాచార్యుల వారు. అంతేకాదు విశిష్టమైన విశిష్టాద్వైత సిద్ధాంతాన్ని విశ్వవ్యాప్తి చేస్తూ, తన బోధనలతో, రచనలతో నాటి సమాజాన్ని ఎంతగానో ప్రభావితం చేసిన భగవదవతార మూర్తి... భగవద్రామానుజుల వారు. వ్యక్తి కంటే సమాజ శ్రేయస్సే ముఖ్యమని, సకల మానవాళి సంక్షేమమే అందరి ధ్యేయం కావాలని ప్రబోధించిన మహా మానవతావాది భగవద్రామానుజాచార్యుల వారు. అందుకే, ఎప్పుడో 11వ శతాబ్దం నాటి ఆ మహనీయుని సమతా బోధనలు.. దాదాపు వెయ్యేళ్ళ తర్వాత.. ఇప్పటికీ సమాజానికి స్ఫూర్తిగా, దీప్తిగా.. వెలుగుల దారులుగా నిలుస్తున్నాయంటే.. అది ఆ మహితాత్ముని గొప్పదనానికి నిదర్శనం.

సకల మానవాళి క్షేమం.. ఆయన జీవిత ధ్యేయం. వెయ్యేళ్ళ క్రితం ఆయన రూపొందించిన ఆగమ క్రతువులే నేటికీ ప్రామాణికంగా ఆచరిస్తున్నామంటే.. అది ఆ మహనీయుని పరిపూర్ణ ఆధ్యాత్మిక భక్తితత్వానికి మనమిచ్చే నీరాజనం. ఆ పరమాచార్యుని విశ్వమానవ తత్వాన్ని ప్రపంచవ్యాప్తం చేయాలనే కృతనిశ్చయంతో శ్రీ చిన్నజీయర్‌స్వామి వారు హైదరాబాద్‌లో ఈ బృహత్ కార్యానికి శ్రీకారం చుట్టడం చరిత్రాత్మకం!.. ఎంతో సమున్నతమైన భగవద్రామానుజుల వారి విగ్రహం భారత ప్రధాని మోడీ చేతుల మీదుగా ఆవిష్కరణ జరుగనుండడం మరో గొప్ప విశేషం.

## సమతా వాదం.. సమానత్వం ఉఛ్వాస నిశ్వాసలుగా జీవించిన మహాయోగి

1017లో తమిళనాడులోని శ్రీపెరంబుదూరులో జన్మించి, కాంచీపురంలో శాస్త్రాలను అధ్యయనం చేసి శ్రీరంగంలో పీఠాధిపత్యం స్వీకరించి ఆజన్మాంతం సకల జన శ్రేయస్సునే ఆకాంక్షించి.. తానే ఒక ఆధ్యాత్మిక శిఖరంగా భాసించిన మహా మహర్షి..భగవద్రామానుజాచార్యుల వారు. సన్యాసం స్వీకరించిన తర్వాత దేశమంతా పర్యటిస్తూ దాదాపు ఆరుదశాబ్దాలకు పైగానే విశిష్టాద్వైత పరమాచార్యునిగా విఖ్యాతిగడించిన మహనీయులాయన. ఆ కాలంలోనే కర్నాటకలోని మేల్కోటి ఆలయంలోకి దళితులను ప్రవేశపెట్టి పెద్ద సంచలనం సృష్టించారు. సమతా వాదం.. సమానత్వ నినాదం ఉఛ్వాస నిశ్వాసలుగా జీవితాంతం జీవించారు. 120 సంవత్సరాల పాటు జీవించి, తన జీవితాన్నంతా ప్రజలకు భక్తిమార్గం బోధించడానికే అంకితం చేసిన మహాయోగి..శ్రీ భగవద్రామానుజులు!

సర్వమానవ సమానత్వం.. ఆ భగవంతుని లక్షణం. దేవుని దృష్టిలో లేని బేదాలు మనుషులు సృష్టించడం ఏమిటి?..అందుకే మనలో మార్పురావాలి. జ్ఞానం ఏ ఒక్కరి సొంతం కాదు. జ్ఞానసాధనకు మానవులందరూ అర్హులే. కులభేదం, వర్ణభేదం దానికి లేదు. ప్రతి ఒక్కరూ ఆ జ్ఞానకాంతిలో మెరవాలి'..అంటూ వెయ్యేళ్ళ క్రితమే నినదించి, ప్రజలను చైతన్యవంతం చేయడానికి అలుపెరుగని కృషిచేసిన మహాజ్ఞాని శ్రీశ్రీశ్రీ భగవద్రామనుజుల స్వామివారు. కొన్ని వర్గాల ప్రజలు గుడికి వెళ్ళడాన్ని అపచారంగా భ్రష్టాచారాలెన్నో వేళ్ళూనుకున్న రోజుల్లోనే రామానుజుల వారు ప్రజల్లో మార్పు కోసం పరితపించడం పెద్ద ఆధ్యాత్మిక విప్లవమే అయింది. అందులోనూ మహారుషులు మాత్రమే జపించే 'నారాయణ మంత్రాన్ని', భవబంధాలనుంచి జీవులను విముక్తం చేసి ధన్యతనొందించే ఆ మంత్రంలోని విశిష్టతను సామాన్య ప్రజలకు కూడా ఉద్బోధించే సాహసం చేశారు. అందుకు నాటి సమాజంలో ఆయనెందరి శాపనార్థాలనో ఎదుర్కొన్నారు కూడా. అయినా ఆయన వెనుకడుగు వేయలేదు. కుల, మత, వర్ణ, వర్గ, జాతి విభేదాలకు అతీతంగా సకల మానవాళి శ్రేయస్సే లక్ష్యంగా ముందుకు సాగారు. భగవద్రామానుజుల వారి బోధనలతో నాటి సమాజం పులకించి పోయింది. ఆయన సంస్కరణా నినాదాలతో దేశం మారుమ్రోగిపోయింది. ఆయన ప్రవచనాలతో భారతీయ ఆధ్యాత్మిక దివ్యజీవన మార్గం కొత్త పుంతలు తొక్కుతూ అప్రతిహతంగా ముందుకు సాగిపోతూనే ఉంది.





Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com